


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

గురువారం 23 అక్టోబర్ 2025

## వైఎస్ఆర్ కడప


పేజీలు - 08




# వాయు గండం!

## జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ

- అల్పపీడన కారణంగా జిల్లాలో ఎడతెరిపి లేని వర్షం
- భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- నదులు, వాగులు, లోతట్టు ప్రాంతాల్లో పోలీస్ గస్తీ
- భారీగా దెబ్బతిన్న కూరగాయ, ఉద్యాన పంటలు






కడప బ్యూరో - మేజర్‌న్యూస్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కడప జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కడప జిల్లాతో పాటు మరో ఐదు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. మరో 24 గంటల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిస్తోంది. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ముసురు ముసుగేసింది. మంగళవారం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తుండటంతో వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. పొలాలు నీటితో నిండిపోయాయి. రోడ్లన్ని వర్షంపు నీటితో చిత్తడిగా కనిపిస్తున్నాయి. బుధవారం తెల్లవారు జాము వరకు 911.4 మి.మీటర్ల వర్షం కురవగా ఉదయం 8.30 గంటల నుంచి 11గంటల వరకు మరో 501 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని, భారీ వర్షం కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం హెచ్చరిస్తోంది. ఇప్పటికే రెవెన్యూ, పోలీస్ శాఖలు రంగంలోకి దిగాయి. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నదులు, వాగుల వద్ద గట్టి భద్రతా చర్యలు చేపట్టి నిఘా పెంచారు.

భారీ వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి మానిటరింగ్ చేస్తోంది. నాలుగు రోజుల నుంచి మిగతా 2పేజీలో

## కడప జైలుకు ఎన్ఐఏ అధికారులు

కడప క్రైమ్, మేజర్‌న్యూస్: కడప సెంట్రల్ జైలుకు ఎన్ఐఏ అధికారులు వచ్చి గతంలో రాయచోటిలో అరెస్టైన ఉగ్రవాది అబూబకర్ భార్య సైరాబానును బుధవారం పీటీ వారెంట్‌పై వారం రోజుల పాటు కస్టడీకి తీసుకున్నారు. ఈ సంవత్సరం జూలై 1న




2 పేజీలో

## వివేక హత్య కేసులో మరో ముందడుగు

కడప క్రైమ్, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో గతంలో సంచలనం లేపిన వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అప్రూవర్ గా మారిన దస్తగిరిని రాజీ కోసం బెదిరింపు విషయంలో ప్రత్యేక విచారణ అధికారి కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ బుధవారం




## తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న.. ఉల్లి, మొక్కజొన్న

### దిక్కు తోచని స్థితిలో రైతన్న

### ప్రభుత్వం ఆదుకోవాలన్న ఉల్లి రైతులు

దువ్వూరు, మేజర్‌న్యూస్ : తుపాన్ ప్రభావంతో దువ్వూరు మండల వ్యాప్తంగా పెద్ద బళ్లారి ఉల్లి రైతులు, మొక్కజొన్న రైతులు కుదేలవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన, పెద్ద బళ్లారి రకం ఉల్లి గడ్డలు, మొక్క జొన్న ప్రస్తుతం రైతులు నూర్పిళ్ళు కొనసాగుతున్నాయి. ఉల్లిగడ్డలు చాలామంది రైతులు తమ పొలాలలోనే విడిచిపెట్టారు. మొక్కజొన్న రైతులు నుర్పిళ్ళు చేసి స్థలాలు లేక ..మిగతా 2పేజీలో




## కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



కడప క్రైమ్, మేజర్‌న్యూస్: కడప నగరపాలక సంస్థ పరిధిలోని 37వ డివిజన్ అల్మాస్‌పేట సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు రికార్డులు పరిశీలించి, అక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "పుర మిత్ర" అప్ డౌన్లోడ్స్ డేటా గురించి విచారించి ఎక్కువ మంది ప్రజలు డౌన్ లోడ్ చేసుకునేలా సిబ్బంది పని చేయాలని ఆదేశించారు. అనంతరం లోతట్టు ప్రాంతాలైన బుగ్గవంక, పాత బస్టాండ్ ప్రాంతాలలో ..మిగతా 2పేజీలో

## వర్షాలతో రైతుల్లో ఆందోళన



### నీట మునిగిన వరి పంట

### గత ఏడాది నష్టం గుర్తుకు

### చేతికి వచ్చే పంటలు వర్షానికి దెబ్బతింటాయని భయం

2లో

చెన్నూరు, మేజర్‌న్యూస్: చేతికి వచ్చిన పంటలు వర్షానికి ఎక్కడ దెబ్బతిం టాయేమోనన్న భయంతో చెన్నూరు మండల రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కేసి ఆయకట్టుతో పాటు బోరు బావుల ఆధారంగా చిన్నమాచుపల్లి, రామనపల్లి, గోపవరం ప్రాంతాల్లో ముందుగా సాగు చేసిన వరి పంట ప్రస్తుతం చిరు కంకుల దశలో ఉంది. శివాలపల్లి వద్ద కొంత మంది రైతులు ఇప్పటికే వరి కోతలు ప్రారంభించగా, మరికొందరు కోతకు సిద్ధమవుతున్నారు. అయితే తుఫాన్ ప్రభావంతో గాలులు వీస్తే వరి నేలవాలిపోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులు వరి సాగు లాభదాయకంగా లేకపోవడంతో బోర్లు, కేసి నీటిపారుదల

# వర్షాలతో రైతుల్లో ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

కింద మొక్కజొన్న పంటను సాగు చేశారు.అయితే మొక్కజొన్న కూడా ప్రస్తుతం కోత దశకు చేరడంతో వర్షాలు పడితే భారీ నష్టం వాటిల్లుతుం దేమోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గత ఏడాది ఇదే సమయంలో తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో ముందుగా సాగు చేసిన వరి పంట తడిసి గింజలు నల్లగా మారి నాణ్యత కోల్పోయిం ది.ఆ సమయంలో ధరలు లేక రైతులు పెట్టుబడి ఖర్చులు కూడా తిరిగి రాక అప్పుల్లో కూరుకుపోయారు. ఈసారి ఎగువ ప్రాంతాల్లో సమయానికి వర్షాలు కురవడంతో ఖరీఫ్ సీజన్‌లో పెన్నాకు ముందుగానే నీరు రావడం రైతుల్లో ఆశను నింపింది.మంచి దిగుబడులు వస్తాయని భావించిన వారు ఇప్పుడు వరుస వర్షాలతో మళ్లీ ఆందోళన చెందుతున్నారు.వరి కంకులకు నల్లగింజ పడి పంట నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. గత ఏడాది పంట నష్టం పరిహారం ఇప్పటివరకు రాకపోవడంతో రైతుల నిరాశ మరింతగా పెరిగింది.

**అన్నదాతల్లో గుబులు**

మంచు ముసురు, వాతావరణంలో తేమ అలాగే భారీ వానల హెచ్చరికల తో రైతుల గుండెల్లో గుబులు మొదలయ్యాయి.మంగళవారం వేకువజా మునుంచే చిరుజల్లులు కురుస్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.చిరు కంకుల దశలో ఉన్న వరి గింజలు తడిస్తే రంగు మారి నాణ్యత దెబ్బతింటుందని సాగుదారులు పేర్కొన్నారు. ఇంకొన్ని రోజులు భారీ వర్షాలు కురిస్తే పంటలపై తీవ్రమైన నష్టం సంభవించే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని కొంతమంది రైతులు మొక్కజొన్న,పసుపు,బంతి పూల పంటలను సాగు చేసుకోగా అత్యధికంగా వరి పంటనే ప్రధానంగా సాగు చేశారు. రాయలసీమ సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికా రులు హెచ్చరించడంతో రైతులు పాలుపోని పరిస్థితిలో ఉన్నారు.

# కడప జైలుకు ఎన్ఐఏ అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదులు అబూబకర్ సిద్దికి, మహమ్మద్ అలీని తమిళనాడు ఐబీ అధికారులు అరెస్టు చేశారు. వీరి ఇద్దరు ఉగ్రవాదుల భార్యలను కూడా అరెస్ట్ చేసి కడప జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉంచారు. బుధవారం కడప సెంట్రల్ జైలుకు ఎన్ఐఏ అధికారులు వచ్చి ఉగ్రవాది అబూబకర్ సిద్దికి భార్య సైరాబానును కస్టడీకి తీసుకొని విజయవాడకు తీసుకెళ్లడం జరిగింది.

# గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండండి

**తహసిల్దార్ శోభన్ బాబు**

**ఎర్రగుంట్ల,మేజర్‌న్యూస్:** తుఫాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాల నేప థ్యంలో గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉం డాలని తహసిల్దార్ శోభన్ బాబు అన్నారు. బుధవారం ఆయన తన కార్యా లయంలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో విధులలో ఉండే వీఆర్వోలు ప్రజలను అప్రమత్తం చేయాలనే ఆదే శించినట్లు తెలిపారు. వాగులు వంకలు, నదులలో నీటి ఉధృత ఉన్న సమయా లలో అక్కడికి వెళ్లకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. వర్షాల ధాటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ యంత్రాంగం యావత్తు జాగురుకతతో వ్యవహరించాలని ఆయన యంత్రాంగానికి సూచించారు. ప్రజలు సైతం ఇబ్బందులకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.



# కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి)

పర్యటించి అక్కడ వర్షం నీటి సమస్య గురించి ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి తెలిపారు. రాబోయే మూడు రోజులు నగరానికి భారీ వర్షసూచన ఉండడంతో కమీషనర్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు . అత్యవసర పరిస్థితిలో నగర ప్రజలకు అందుబా టులో హెల్ప్ లైన్ నెంబరు 9949093772 ఏర్పాటు చేశారు. ప్రజలు చెప్పిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికా రులకు సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.

# వాయి గండం!

(మొదటి పేజీ తరువాయి)

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కూరగాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కాగా.. నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం బుధవారం సాయంత్రానికి నైరుతి, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాల వైపు కదులుతూ తదుపరి 24 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లు జారీ అయ్యాయి. కడపతో పాటు చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉంది. వాయుగుండం తుపానుగా మారడంతో దీని ప్రభావంతో కడప జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని వెల్లడించింది. ఈ క్రమంలో చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద ఉండరాదని.. లోతట్టు ప్రాంతప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని.. వాగులు, రోడ్లు దాటే ప్రయత్నం చేయరాదని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరికలు జారీ చేశారు. దీనికి అనుగుణంగానే జిల్లా యంత్రాంగం అన్ని భద్రతా చర్యలు చేపట్టింది. వర్షాల నేపథ్యంలో వాగులు, వంకలు, నదులు, లోతట్టు ప్రాంతాలలో ఉన్న ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ జిల్లా పోలీసు సిబ్బందిని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో భద్రతను ఏర్పాటు చేశారు.

**కడపకు రెడ్ అలర్ట్ జారీ..**

వాయిగుండం కారణంగా కడప జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ క్రమంలో కడపతో పాటు శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. బాపట్ల, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఎల్లో అలర్ట్ చేసింది. గురువారం నుంచి ఆదివారం వరకు రాష్ట్రంలోని అక్కడక్కడ భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ క్రమంలో ఆయా జిల్లాల యంత్రాంగం గట్టి భద్రతా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో కడప కలెక్టరేట్‌లో కంట్రోల్ ఏర్పాటు చేసి అన్ని మండలాల అధికారులతో మాట్లాడుతూ సమన్వయం చేస్తున్నారు.

**మండలాల వారీగా వర్షపాతం..**

మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లాలో 911.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. వంటిమిట్టలో అత్యధికంగా 66.4 మి.మీటర్లు కురిసింది. మండలాల వారీగా పరిశీలిస్తే.. కొండాపురం 8.2 మి.మీ, మైలవరం 12.4, పెద్దముడియం 2.8, రాజుపాలెం 28.2, దువ్వూరు 23.6, మైదుకూరు 49.2, బ్రహ్మంగారిమట్టం 31.2, శ్రీ అవధూత కాశినాయన 19.0, కలసపాడు 18.2, పోరుమామిళ్ల 15.2, బి.కోడూరు 38.6, బద్వేల్ 32.2, గోపవరం 43.8, ఖాజీపేట 30.2, చాపాడు 27.2, ప్రొద్దుటూరు 14.2, జమ్మలమడుగు 19.2, ముద్దనూరు 25.2, సింహాద్రిపురం 10.8, లింగాల 10.0, పులివెందుల 7.2, వేముల 6.0, తొండూరు 22.8, వీరపునాయునిపల్లె 9.4, యర్రగుంట్ల 35.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అదేవిధంగా కమలాపురం 28.4, వల్లూరు 21.4, చెన్నూరు 28.6, అట్లూరు 62.2, ఒంటిమిట్ట 66.4, సిద్దవటం 38.6, కడప 48.8, చింతకొమ్మదిన్నె 40.8, పెండ్లిమర్రి 17.6, వేంపల్లి 8.0, చక్రాయపేట 10.2 మి.మీటర్లు కలిపి బుధవారం తెల్లవారుజాము వరకు జిల్లా మొత్తం 911.4 మి.మీటర్ల వర్షం కురిసింది. కాగా బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటలకు జిల్లాలో చెప్పుకోతగ్గ వర్షం కురిసింది. 2.30 గంటలో 501.2 మి.మీటర్ల వర్షం కురిసింది. దీంతో జిల్లాలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నదులు.. వాగులు..వంకల్లోకి..పంట పొలాల్లోకి వరదనీరు చేరింది. గ్రామాల్లోకి కూడా పెద్ద ఎత్తున వర్షం నీరు నిలిచిపోయింది. మరో రెండు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

# తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న ఉల్లి, మొక్కజొన్న

(మొదటి పేజీ తరువాయి)



రోడ్లపై ఆరబెడుతున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా ఆగకుండా వర్షం పడుతోంది. వర్షాన్నుంచి మొక్కజొన్న విత్త నాలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారుల వెంబడి రోడ్లపై మొక్కజొన్న విత్తనాలను కుప్పలుగా పోసి ప్లాస్టిక్ పట్టలతో వర్షానికి తడవకుండా జాగ్రత్త పడుతున్నారు. మంగళవారం నుంచి అధికంగా వర్షం పడడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రబీ సీజన్ లో ఆరుతడి పంటలు సాగు చేపట్టిన రైతులు వర్షానికి విత్తనాలు దెబ్బ తింటాయని దిగాలు చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్లో లో సాగు చేసిన వరి పంట మాత్రం వర్షం వల్ల ఎలాంటి నష్టం ఉండదని పేర్కొంటున్నారు. ముందస్తుగా వరి పంట సాగు చేసి నూర్పిడి చేపడుతున్న రైతులు మాత్రం ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దువ్వూరు మండలం లోనిరామాపురం, మీర్జాఖాన్ పల్లె, గుడిపాడు, గొల్లపల్లె, మానేరామ్ పల్లె, చిన్నసింగనపల్లె, పెద్ద సింగనపల్లె, మదిరేపల్లె,బాలయపల్లె, నీలపురం, దాసరిపల్లె, మూడిండ్లపల్లె, ఎకోపల్లె, జిల్లెల్ల, కానగూడూరు, కృష్ణంపల్లె, తదితర గ్రామాలలో ఉల్లి, మొక్కజొన్న పంట నూర్పిళ్ళు పనులు చేపట్టారు. ఆగకుండా పడుతున్న వర్షానికి దువ్వూరు, క్రీస్తురాజపురం, గుడిపాడు, మీర్జాఖాన్ పల్లె, కానగూడూరు బైపాస్‌లలో వర్షం నుంచి మొక్కజొన్నను కాపాడుకునేందుకు పట్టలు కప్పిన రైతులు. గ్రామాల్లో రోడ్లన్నీ బురదమయ మయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి ఇబ్బందికరంగా తయారైంది. వర్షం రెండుమూడు రోజులపాటు ఆగ కుండా పడితే తీవ్ర నష్టం వాటి ల్లుతుందని రైతుల్లో ఆందోళన నెలకొంది. ఉల్లి రైతుల పరిస్థితి కూడా అగమ్యగోచరంగా తయారైంది. ధరలు లేక పోవడంతో రైతులు చాలావరకు నూర్పిడి చేయకుండా ఉల్లిగడ్డలను అలానే పొలంలో ఉంచారు. ప్రస్తుత వర్షానికి ఉల్లిగడ్డలు కుళ్లి దెబ్బ తింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాలలో కేపీ ఉల్లి పంట సాగు చేశారు. ఈ పంట మొలక వచ్చినట్టే వచ్చి ప్రస్తుతం పడుతున్న వర్షానికి ఉల్లి నారు చనిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే మినుము పంట కూడా ప్రస్తుతం సాగు చేస్తున్నారు. వర్షం వల్ల ఈ పంట కూడా పూర్తిగా దెబ్బతింటుందని రైతులు దిగులు చెందుతున్నారు.ఏది ఏమైనా ప్రస్తుతం కురుస్తున్న తుఫాను వల్ల రైతులు చాలా నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పంటలు దెబ్బతిని పూర్తిగా చేతికి రాకపోవడం, రబి సీజన్లో సాగు చేసిన పంటలు ముందుగానే దెబ్బతింటుండంతో రైతు పరిస్థితి దయనీయంగా మారింది. రాష్ట్ర, జిల్లా, మండల ఉన్నత అధికారులు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా చూడాలని రైతన్నలు కోరుతున్నారు.

# వివేక హత్య కేసులో మరో ముందడుగు

**బీటెక్ రవి వాంగ్మూలం నమోదు చేసిన విచారణ అధికారి**

**కేసు పురోగతి కోసం ప్రత్యేక అధికారి ప్రయత్నం**

(మొదటి పేజీ తరువాయి)

కడపలో విచారించారు. వివేక హత్య కేసులో అప్రూవర్ గా మారిన దస్తగిరిని కడప సెంట్రల్ జైల్లో ఉండగా వైయస్సార్ పార్టీకి చెందిన డాక్టర్ చైతన్య రెడ్డి బెదిరింపులకు గురి చేశాడంటూ అప్పట్లో దస్తగిరి ఫిర్యాదు చేశాడు. సెంట్రల్ జైల్లో 2023 నవంబర్లో డాక్టర్ చైతన్య రెడ్డి మెడికల్ క్యాంపు పేరుతో సెంటర్ జైల్లోకి వెళ్లి దస్తగిరిని అతని బ్లాక్ లోనే బెదిరింపులకు గురి చేసినట్లు అప్పట్లో దస్తగిరి ఆరోపించారు. అదే సమయంలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి కూడా మరో కేసులో కడప సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఈయన బేరక్ ఎదురుగా బ్లాక్లో దస్తగిరి ఉండటం చైతన్య రెడ్డి దస్తగిరి బ్లాక్ లోకి వెళ్లి రాజీ కమ్మని బెదిరించడం తాను గమనించినట్లు అప్పట్లో బీటెక్ రవి సాక్షిగా ఉన్నారు. ఆ విచారణకు సంబంధించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి న తర్వాత వివేక కూతురు సునీత కోర్టులో ఈ విషయాలు అన్నిటిపై సాక్షులను బెదిరింపులకు గురి చేస్తున్నారన్న విషయాలను ఆరోపిస్తూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయం ప్రత్యేకంగా విచారించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక విచారణ అధికారిగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంతును నియమించారు. దీనికి సంబంధించి బుధవారం ప్రత్యేక అధికారి కడపకు చేరుకొని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిని విచారించారు. కడప సెంట్రల్ జైలుకు పిలిపించుకొని అక్కడ రికార్డులను పరిశీలించిన తర్వాత బీటెక్ రవిని విచారించి ఆయన స్టేట్మెంట్ను నమోదు చేశారు. విచారణలో భాగంగా బీటెక్ రవి అప్పట్లో తాను రిమాండ్ లో ఉన్నప్పుడు చైతన్య రెడ్డి సెంటర్ జైల్లో మెడికల్ క్యాంపు పేరుతో దస్తగిరి బ్లాక్ లోకి వెళ్లినట్లు తాను స్వయంగా చూసినట్లు విచారణ అధికారికి వెల్లడించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి అప్రూవర్ దస్తగిరి చేసిన ఆరోపణలు బీటెక్ రవి ఇచ్చిన వాంగ్మూలం చూస్తే డాక్టర్ చైతన్య రెడ్డి బెది రించాడు అన్న బలాన్ని చేకూరుస్తున్నాయి. ఇప్పటికీ గత ఏడు సంవత్సరాలు గా విచారణ పేరుతో కొనసాగుతున్న వైఎస్ వివేకా హత్య కేసును మరి ఎప్ప టికీ ముగుస్తుందో అన్న విభిన్న అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి.

## సమాజంలో మహిళల భద్రత పట్ల అవగాహన కార్యక్రమం

చాపాడు సబ్ ఇన్స్పెక్టర్ చిన్న పెద్దయ్య



**చాపాడు, మేజర్‌న్యూస్:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం చాపాడు కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు మహిళల భద్రత పట్ల అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సమాజాన్ని, పాఠశాలను, కుటుంబాన్ని గౌరవించాలని. చాపాడు కస్తూర్బా బాలికల పాఠశాల నందు విద్యార్థులకు ప్రత్యేక పోలీసు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగలక్షుమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చాపాడు సబ్ ఇన్స్పెక్టర్ చిన్న పెద్దయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఎస్.ఐ మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులను, పాఠశాల టీచర్లను గౌరవిస్తూ సమాజంలో మంచి సత్ప్రవర్తనను కలిగి ఉండాలని కోరారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లు వాడకూడదని అలాగే ఇంటర్నెట్‌లో సైబర్ నేరగాళ్ళమోసం చేసే అవకాశాలు ఇప్పుడు ఎక్కువ అవుతున్నాయని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణను అలవారుచుకోవాలని క్రమశిక్షణ చర్యలకు గురైతే వారిజీవితంలో అది మచ్చగా మిగిలిపోతుందని, విద్యార్థులకు పోలీసులు స్నేహితులుగా ఉంటారని, కానీ చెడు ప్రవర్తన కలిగిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలపై మక్కువ పెంచుకుని విజయాలు సాధించాలి

హెచ్‌ఎం శివమునెమ్మ



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** విద్యార్థులు చదువు, ఆటల పోటీలు, క్రీడలపై మక్కువ పెంచుకుని విజయాలు సాధించాలని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శివమునెమ్మ అన్నారు. స్కూల్ ఆఫ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చూపి జిల్లాస్థాయికీ ఎంపికయ్యారు. ఆయా విభాగాల్లో గుణశేఖర్, మధుసూదన్ రెడ్డి, వంశీ, భాస్కర్, ధీరజ్‌లు వివిధ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచారు. ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని, వీరి పట్ల హెచ్‌ఎం హర్షం వ్యక్తం చేశారు. జిల్లాస్థాయి పోటీల్లో మంచి విజయాలను సొంతం చేసుకోవాలని, పాఠశాల గుర్తింపు తెచ్చేందుకు కృషి కృషి చేయాలని ఆకాంక్షించారు. అలాగే ఫిజికల్ డైరెక్టర్లు నిశాల్, ప్రమీల, ఉపాధ్యాయ బృందాన్ని ఆమె అభినందించారు.

## ముగిసిన రాణి తిరుమల దేవి డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్




**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** స్థానిక మైదుకూరు రోడ్డులోని రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్పెషల్ స్పెషల్ క్యాంపులో భాగంగా ఏడవ రోజు బుధవారం స్థానిక తాళ్ళమాపురం గ్రామంలో బహిరంగ మలవిసర్జన నిర్మూలన కార్యక్రమం పై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ గ్రామంలో ప్రతి ఇంటి కి వెళ్లి బహిరంగ మలవిసర్జన చేయడం వల్ల వచ్చు అనారోగ్యం పరిస్థితుల గురించి చాలా చక్కగా వివరించారు. అలాగే మధ్యాహ్నం కళాశాల ప్రాంగణంలో ముగింపు సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగినది ఈ సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ ఎల్ .తరుణేంద్ర శేఖర్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ విద్యను అభ్యసించడమే కాకుండా సామాజిక సేవా దృక్పథాన్ని పెంచుకున్నప్పుడే మంచి నాయకుడు కాగలరని అందుకు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్స్ మంచి అనుభవాన్ని ఇస్తాయని కొనియాడారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి. చంద్రశేఖర్ రెడ్డి డైరెక్టర్ సుబ్బరాయుడు పాల్గొని స్పెషల్ క్యాంపును విజయవంతంగా ముగించిన వాలంటీర్స్ అందరికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ , వైస్ ప్రిన్సిపల్ ఎస్ వెంకటేశ్వర్ రెడ్డి అధ్యాపకులు అధ్యాపకేత్ర బంధం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నేడు అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించిన డిఈఓ

కడప ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ : వైయస్ఆర్ కడప జిల్లా కలెక్టర్, ఆదేశాల ప్రకారం వైయస్ఆర్ కడప జిల్లా యందలి పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులకు, ఉప విద్యాధికారులకు, మండల విద్యాశాఖాధికారులకు వాతావరణ శాఖ జారి చేసిన సూచనల మేరకు నిరంతరాయంగా కురుస్తున్న వర్షం కారణంగా అన్ని యాజమాన్యముల (ప్రభుత్వ/ప్రైవేటు) పాఠశాలలకు మరియు అంగన్వాడి పాఠశాలలకు నేడు సెలవు దినంగా డిఈఓ ఒక ప్రకటనలో తెలిపారు.

## సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలి

ప్రిన్సిపాల్ నాగేంద్ర




**వేంపల్లె, మేజర్‌న్యూస్:** సమాజం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్ర సూచించారు. బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో తంగేడుపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం సర్పంచ్ స్వర్ణలత మాట్లాడుతూ ప్రధాని మోడీ శ్రీకారం చుట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం సంతోషకరమన్నారు. అలాగే హెచ్‌ఎం షమీనా బాను మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వీటి పట్ల అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది సంధ్య మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి సమాజ పురోభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఎన్ఎస్ఎస్ అధికారి డా.ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ ఏడు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా స్వచ్ఛభారత్ ర్యాలీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.సతీష్, అధ్యాపకుడు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయుడు రాఘవరెడ్డి, విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారు.

## వర్షం కురిస్తే తెల్లపాడు యస్.సి.కాలనీలో వీదులలో దుర్గంధ భరితం




**కలసపాడు, మేజర్‌న్యూస్:** కలసపడుమండలంలోని తెల్లపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని దూలంవారిపల్లె దళిత కాలనీలో చిన్నపిల్లలు, వృద్దులు,ప్రజలు తిరగాలంటే ఎన్నో అవస్థలు పడుతున్నారని గ్రామ ప్రజలు వాపోతున్నారు.ఇటీవల కురుస్తున్న వర్షాలతో జన జీవనం ఇబ్బంది పడుతున్నా ఏ ఒక్కరూ పట్టించు కోవడం లేదని స్థానిక ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. దళిత వాడ వీదులలో వీది రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేనందున ప్రజా జీవనానికి సంబంధించిన అవసరాలు తీర్చడానికి ప్రజా ప్రతినిధులు గానీ, గ్రామ పంచాయతీ అధికారులు గానీ పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, ఎన్ని సార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా సమస్య పరిష్కారం చూపడం లేదని స్థానిక దళిత ప్రజలు అవేదనవ్యక్తం చేస్తు న్నారు. వీదులలో వర్షం కురిస్తే చాలు ప్రజలలో అవేదనతో బాధను వ్యక్తం చేస్తుంటారు.సిమెంట్ రోడ్లు ఉన్నప్పటికీ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేనందున ప్రజలు పలు రకాలుగా ఇబ్బంది పడుతున్నా సంబంధిత అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, ఈ కాలనిలో 250 కుటుంబాలు పైగా ఉన్నప్పటికి డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేనందున ఎక్కడి వృధా నీరు మురికి నీరు వీది రోడ్లు మురికి మయం కావడంతో దళిత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు కాబట్టి యస్సీ కాలనీ లో పరిస్థితులను పరిశీలించి దళిత కాలనీ వాసులు సమస్య వెంటనే ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


# వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై వైసిపి పార్టీ ఆందోళన

### కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న - జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి

### కూటమి ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలపై పార్టీ నేతల తీవ్ర విమర్శలు

### విద్య, వైద్యంలో ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించిన - నరేన్ రామాంజులరెడ్డి






**కమలాపురం, మేజర్‌న్యూస్ :** వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కమలాపురం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి. నరేన్ రామాంజులరెడ్డి పాల్గొన్నారు, కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సంఘీభావం తెలిపారు, ఈ సందర్భంగా మీడియాతో జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు పూర్తైనా, పాలనలో ఎటువంటి ప్రజాహిత దృక్పథం కనిపించడం లేదు అన్నారు, జగన్మోహన్ రెడ్డి పాలనలో స్థాపించిన 17 మెడికల్ కాలేజీలను నిర్వీర్యం చేయడమే కాకుండా, ప్రైవేటీకరించేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు, సింగిల్ టెండర్ విధానంలో వేల కోట్ల విలువ గల ప్రభుత్వ ఆస్తులను కొద్దిపాటి ధరలకు అప్పగించడం, ఎకరా భూమిని 99 పైసలకే లీజుకు ఇవ్వడం, 50 ఎకరాల ఆసుపత్రిని సంవత్సరానికి కేవలం రూ 4000 అద్దెకు దారాదత్తం చేయడం వంటి విషయాలను ప్రస్తావిస్తూ, ప్రజలంతా ఈ నిర్ణయాలను తీవ్రంగా ఖండించాలని కోరారు, అనంతరం కమలాపురం నియోజకవర్గం వైఎస్ఆర్సిపి పార్టీ ఇంచార్జ్ పి నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ప్రజల ఆరోగ్యంపై ఎటువంటి శ్రద్ధలేదు అన్నారు, ఆరోగ్యశ్రీ సిబ్బంది సమ్మెలో ఉన్నా పరిష్కారం లేదు. 108, 104 సేవలు పూర్తిగా స్థంభించాయి అని ప్రజలకు చికిత్స అందని పరిస్థితి నెలకొంది అని అన్నారు, విద్యా రంగంలో సీబీఎస్ఈ, ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ క్లాసులు ఎత్తివేశారు అని, అలాగే తల్లికి వందనం' వంటి పథకాలను పెట్టి లక్షల మందికి ఇవ్వలేదని విమర్శించారు, గత వైఎస్ఆర్సిపి అధికారంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి విద్యారంగంలో విద్యార్థులకు ట్యాబులు, ఇంగ్లీష్ మీడియం సిబిఎస్ సి, డిజిటల్ క్లాసులు పెట్టి ప్రతి ఒక్కరికి రాష్ట్రంలో విద్యా అందాలనే గొప్ప సంకల్పంగా పరిపాలన అందించారని తెలిపారు, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో వైద్య, విద్య రంగాల ప్రైవేటీకరణ వల్ల మధ్య తరగతి కుడా పేదవారిలా అవకతవకలు పడుతుందన్నారు, పేదవాడికి వైద్యం, చదువు ఊహగతం అవుతుందని తెలిపారు, ప్రతి ఒక్కరూ రాష్ట్రంలో ఈ దుర్మార్గమైన పరిపాలనను ఖండించి వ్యతిరేకించాలన్నారు, ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు, ఆరు మండలాల కన్వీనర్లు, ఉత్తమా రెడ్డి, మారుజోల్ల శ్రీనివాసులు రెడ్డి, ఉప మండల అధ్యక్షులు చెన్నకేశవరెడ్డి, సుమిత్ర రాజశేఖర్ రెడ్డి, సంబటూర్ ప్రసాద్, వైఎస్ఆర్సిపి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఇస్మాయిల్ , సుబ్బారెడ్డి, మహమ్మద్ సాదిక్, జాఫర్, మర్రి సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు..

# మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాస ప్రత్యేక పూజలు

## గ్రూప్ ఆఫ్ టెంపుల్ చైర్మన్ సుదీకర్ రెడ్డి





**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణ పరిధిలోని శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నుండి కార్తీకమాసం ప్రారంభోత్సవ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉదయాస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు శివ రుద్రాల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం సహస్రనామార్చన బిల్వార్చన భస్మాభిషేకం తదితర పూజా కైకర్యాల అనంతరం మిట్టమల్లేశ్వరుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సుధీకర్ రెడ్డి పత్రికా ముఖంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే కార్తీకమాసంలో నిర్వహించు పూజా కార్యక్రమాలను స్వామివారి ఆశీస్సులతో యధావిధిగా భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్తీకమాసంలో మహిళలు పెద్ద సంఖ్యలో రావడం జరుగుతుందని ఆలయానికి వచ్చు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ నెలలో భక్తులు తెల్లవారుజామున ఆలయాలకు వచ్చి శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తారు, నదులలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు మరియు ఆలయాల వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తారు. ఈ నెలంతా భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది, ముఖ్యంగా సోమవారాలు మరియు పౌర్ణమి రోజులలో భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి చేరుకుంటారు. అభిషేకాలు మరియు శివునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు, ఆలయాల ముందు కార్తీక దీపాలు వెలిగించి తమ మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందన్నారు. ఈ మాసంలో భక్తులు విశేష పూజలు నిర్వహించి మిట్టమల్లేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు.

## భగవంతుని మాల ధరించడం పుణ్యకార్యం

### శుభాల మాసం కార్తీక మాసం



**పులివెందుల రూరల్ మేజర్‌న్యూస్ :** శివుడికి ప్రీతిపాత్రమైన మాసం కార్తీక మాసం బుధవారం నుంచి ప్రారంభం కావడంతో మండల పరిధిలోని ఇనగలూరు గ్రామానికి చెందిన శివ భక్తులు శివమాల ధరించారు. ఈ మాసంలో ప్రతిరోజు విశిష్టమైనదే. కార్తీక మాసంలో దీపారాధన చేయడం ద్వారా సర్వపాపాలు హరించుకు పోతాయని ప్రజల నమ్మకం. సూర్యోదయానికి ముందే నదీస్నానం చేసి శివపార్వతులకు పూజలు చేస్తారు. ఈ మాసంలో శివుడికి దీపారాధన చేసి పూజలు చేసిన వారికి విశేషమైన పుణ్యం లభిస్తుంది. తద్వారా ఈతి బాధలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. అందుకే చాలామంది శివ భక్తులు సాయంత్రం వేళ గుడిలో దీపారాధన చేస్తారు. ఇలా చేయడంవల్ల జన్మజన్మల పాపాలు తొలగిపోతాయని వారు విశ్వసిస్తారు.

## ఉల్లి పంటకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవలి



**పులివెందుల రూరల్ మేజర్‌న్యూస్ :** ఉల్లి పంటకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని గంగనపల్లె గ్రామానికి చెందిన రైతు రామిరెడ్డి రఘునాథరెడ్డి అన్నార్ను ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు గిట్టుబాటు ధరలు లేక రైతుల తీవ్రంగా నష్టపోవడం బాధాకరమన్నార్ను పంట చేతికొచ్చే సమయానికి సరైన ధరలు లేకపోవడంతో భారీగా నష్టపోతున్నారని అటువంటి సమయంలో ధర ప్రకటించడంతోపాటు సొంతంగా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నార్ను అరటి,చీనీ,బొప్పాయి,ఉల్లి లాంటి అన్ని పంటలకు ధరలు లేక రైతులు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశార్ను నష్టపొయిన ఉల్లి రైతులకు హెక్టారుకు రూ,50 వేలు తక్షణమే రైతుల ఖాతాలో వేయాలన్నార్ను

# భక్తి భావంతో అయ్యప్ప మాల దారణలు

## శరణ ఘోషతో అయ్యప్ప స్వామి ఆలయం



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణ పరిధిలోని పార్లపల్లి రోడ్డు కోతి సమాధి వద్ద కొలువై ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక మాసం మొదటి రోజు బుధవారం భక్తి భావంతో అయ్యప్ప నామ శరణు ఘోషతో మాల ధారణ కార్యక్రమాలను అయ్యప్ప భక్తులు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉదయాస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు గురుస్వామి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఉదయాస్తమాన స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన బిల్వార్చన కర్పూర హారతుల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో దర్శనమివ్వగా, 250 మంది పైగా అయ్యప్ప మాలధారణ కార్యక్రమాలను గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ కార్తీకమాస మొదటిరోజు పెద్ద సంఖ్యలో మాల ధారణ ధరించడం జరిగిందని, ఇంకా చాలామంది మాల ధారణ ధరించే స్వాములు ఉన్నారని, అయ్యప్ప మాల ధారణ ధరించే భక్తులకు, ఆలయ ప్రాంగణంలో ప్రతినిత్యం భిక్ష ఉదయం సాయంకాలం స్వాములు స్నానమాచరించేందుకు మండల కాలం ఆలయంలో ఉండేందుకు అన్ని విధాల ఏర్పాట్లు భక్తుల సహకారంతో చేయడం జరిగిందన్నారు. గురు స్వామి వెంకటరామిరెడ్డి భక్తులకు సూచనలు తెలియజేస్తూ కార్తీక మాసం ప్రారంభంతోనే అయ్యప్ప మాల ధారణ చేస్తారు, ఇది సాధారణంగా 41 రోజుల మండల దీక్షతో ఉంటుంది. ఈ దీక్షలో భాగంగా భక్తులు నియమ నిష్ఠలతో పూజలు చేస్తూ, శబరిమల యాత్రకు సిద్ధమవుతారు. ఈ మాల ధారణ వల్ల ఆధ్యాత్మిక ఆనందం, మానసిక ప్రశాంతత లభిస్తాయని భక్తుల నమ్మకం. అయ్యప్ప మాల ధారణ అనేది 41 రోజుల పాటు కొనసాగే ఒక కఠినమైన వ్రతం. ఈ సమయంలో భక్తులు చన్నీటి స్నానం చేయడం, నేలపైన నిద్రపోవడం, నల్లని దుస్తులు ధరించడం, పాదరక్షలు వాడకపోవడం వంటి కఠిన నియమాలను పాటిస్తారు. ఈ నియమాలు పాటించడం ద్వారా ఆధ్యాత్మిక పునీతత్వం, మానసిక ప్రశాంతత లభిస్తాయని నమ్మకం. కార్తీక మాసం ప్రారంభం నుండి మకర సంక్రాంతి వరకు ఈ దీక్ష కొనసాగుతుంది. అయ్యప్ప మాల ధరించిన వాళ్ళు మనసు, శరీరం మొత్తం దేవుడి మీద లగ్నం చేస్తారు. భక్తి శ్రద్ధలతో నిత్యం పూజలు చేస్తారు. దీని వల్ల ప్రాపంచిక కోరికలు ఉండవు. మనసు తేలికగా ఉంటుంది. భక్తి మార్గంలో పయనిస్తారు. నిత్యం ఎన్నో ఒత్తిడులతో నలిగిపోయే ప్రజలు మాల ధరించిన తర్వాత చన్నీటి స్నానం చేయడం వల్ల మెదడు మీద దాని ప్రభావం తగ్గిపోతుంది. అలాగే కఠినమైన ఆహార నియమాలు పాటిస్తారు. స్వామియే శరణమయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మారుమోగాయి. ఈ కార్యక్రమంలో అంబకపల్లి బాబు రెడ్డి, సుధా, చిక్కని హరి, ఇతర అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు

# భక్తి శ్రద్ధలతో శివమల ధరించిన కాంగ్రెస్, సీనియర్ నేతలు



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణం, పార్నపల్లె, రోడ్డు లోని శివాలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలను శివయ్యకు అర్పించిన అనంతరం శివాలయం పూజారి అరా స్వామి చేతుల మీదగా శివ మాల ధరించిన కాంగ్రెస్, పిసిసి డెలి గెట్, వేలూరు. శ్రీనివాసరెడ్డి, జిల్లా మాజీ కార్యదర్శి బాలం సుబ్బరాయుడు, ఇరువురు స్వాములు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శివమాల అనేది ఇది శివుని కన్నీటి నుండి ఉద్భవించిందని శివుడు బోల శంకరుడు, అని ఆయన భక్తులను నిత్యం రక్షించే మనస్తత్వం కలిగిన శివయ్య అని శివమాల ధరిస్తే పాపాలు హరిస్తాయని వారు తెలిపారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేస్తా


## – టిడిపి మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఇస్మాయిల్



**వేంపల్లె మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, తనకు ఇచ్చిన విభాగం అభివృద్ధికి కృషి చేస్తానని ఆ పార్టీ మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఇస్మాయిల్ అన్నారు. స్థానిక రాజాతోటకి చెందిన టంగుటూరి ఇస్మాయిల్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియామకం అయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే యువతను గుర్తించి పదవులు కల్పించడం శుభపరిణామన్నారు. తనపై నమ్మ కంతో ఈ పదవి బాధ్యతలు అప్పగించడం చాలా సంతోషంగా ఉందని, అధి ష్టానం ఆదేశాల ప్రకారం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని, ప్రభుత్వ సంక్షేమ, అభి వృద్ధిని ప్రజల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే నియోజకవర్గ బాధ్యుడు ఎం. రవీంద్రనాథ్ రెడ్డి, వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, కన్వీనర్ రామమునిరెడ్టి,ప్రాంతీయ ఇంఛార్జి మహమ్మద్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆధార్ స్పెషల్ క్యాంప్స్ సద్వినియోగం చేసుకోండి

### పురపాలక కమిషనర్ రాముడు



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల పురపాలక సంఘ పరిధిలోని నిర్దేశించిన ప్రాంతాలలో ఆధార్ స్పెషల్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పులివెందుల పురపాలక కమిషనర్ రాముడు పేర్కొన్నారు ఈ సందర్భంగా పత్రికాముఖంగా తెలియజేస్తూ భారత దేశంలో ఆధార్ ఒక విశిష్ట గుర్తింపు కార్డుగా ఉన్నది. ఈ ఆధార్ కార్డుతో ప్రజలు అనేక రకాలైన ప్రభుత్వ పథకాలు పొందుచున్నారు. ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ లో ఉన్న ఆధార్ కార్డులు ఇంకా చాలా వరకు బయోమెట్రిక్ అప్డేషన్ మరియు డాక్యుమెంట్స్ అప్డేషన్ పెండింగ్ ఉన్నందున ప్రభుత్వం వారి ఉత్తర్వుల ప్రకారం ఆధార్ స్పెషల్ క్యాంప్స్ టైం షెడ్యూల్ ను 23.10.2025 నుండి 30.10.2025 వరకు పులివెందుల పురపాలక సంఘ పరిధిలోని నిర్దేశించిన విద్యా సంస్థల నందు నిర్వహించడం జరుగును. 23.10.2025 నుండి 27.10.2025 వరకు నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ మరియు న్యూ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు,28.10.2025 నుండి 30.10.2025 వరకు లయోలా డిగ్రీ కాలేజి మరియు ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ నందు ఆధార్ నమోదు కేంద్రములు నిర్వహించబడును. కావున సదరు ఆధార్ నమోదు కేంద్రాల నందు ఆధార్ సంబంధిత సేవలను విద్యార్థులు వినియోగించు కొనవలసినదిగా కోరడమైనదని తెలిపారు.

# బాధిత కుటుంబానికి సహాయం



**కడప క్రైమ్ మేజర్‌న్యూస్ :** ఇటీవల అనారోగ్యం తో మరణించిన ఏ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ టి.చెన్నరాయుడు కుటుంబానికి జిల్లా ఎస్.పి నచికేత్ విశ్వనాథ్ రూ.2.5 లక్షల ఆర్థిక సాయాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం అంద చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి కానిస్టేబుల్ కుటుంబ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు . అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. పోలీసు శాఖ అండగా ఉంటు ందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్.పి కె.ప్రకాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# వై. వి.యు వసతి గృహ ప్రత్యక్ష పరిశీలనలో వి.సీ. ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్

## పరిశుభ్రత లో నాణ్యతా ప్రమాణాలను పాటించండి సిబ్బందికి పలు సూచనలు



**పెండ్లిమర్రి,, వై, వి. యు మేజర్‌న్యూస్ :** బాధ్యతలు తీసుకున్నప్పటినుండి ప్రతి పనిలోనూ బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తున్న వైస్ ఛాన్సలర్ ఆచార్య బెల్లం కొండ రాజశేఖర్ దినచర్యలో భాగంగా బుధవారం నాడు ఉదయం విశ్వ విద్యాలయ వసతి గృహాలను విద్యార్థులు అల్పాహారం తీసుకునే సమ యంలో ఆకస్మిక తనిఖీ చేశారు. అల్పాహారం రుచి ఎలా ఉంది, రోజూ భోజనం, కూరలు రుచికరంగా ఉన్నాయా? లేదా? అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం ప్రాంగణాన్ని ప్రత్యక్షంగా పరిశీ లించారు. విద్యార్థుల హాజరు రికార్డులను చూశారు. విద్యార్థినిలు ఉంటున్న వసతి గృహం లోనూ మెనూ గమనించారు. వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పరిశుభ్రత తో ఆహార పదార్థాలను సిద్ధం చేసి ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. ఉపకులపతి వెంట వసతి గృహాల చీఫ్ వార్డెన్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్ , డాక్టర్ రెడ్డయ్య ఉన్నారు.

# వర్షం పడితే రోడ్లు జలమయం

## ప్రమాదాలకు నిలయంగా నీరు నిల్వ - దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు




**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల మున్సిపాలిటీ పరిధి లోని వై ఎస్ చిన్న కొండ రెడ్డి కాలిని వెళ్లే దారి లో చిన్నపాటి వర్షం కురిసిన రోడ్లు జలమలయం కావడంతో ప్రమాదాలకు నిల యంగా నీరు నిల్వ ఉండడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చెందడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆ ప్రాంత వాసులు పత్రికాముఖంగా తెలియ జేస్తూ వర్షం పడితే చాలు ఇంటి నుండి బయటకు వెళ్లడానికి రోడ్లపై మురుగునీరు వర్షపు నీరు చేరు కోవడంతో చుట్టుప్రక్కల ఉన్న ఇంటి వద్దకు నీరు చేరుకుని దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందని, అంతేకాకుండా రోడ్లపై వెళుతున్న వాహనదారులకు పాదచారులు ప్రమాదాలకు గురి ఇప్పటికే కావడం జరిగిందని, వార్డ్ కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పలుమార్లు మున్సిపల్ సిబ్బందికి తెలిపినప్పటికీ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ ప్రాంత వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు తీర్చాలని వేడుకుంటున్నారు.

# కరెంటు తగిలి మూడు పందుల మృతి

## చెత్త డంపింగ్ యార్డు గేట్‌కు విద్యుత్ ప్రవాహం - జనావాసాలకు తప్పిన ప్రమాదం

## - మెయిన్ లైన్ తెగి గేటుపై పడటమే కారణం

**వల్లూరు మేజర్‌న్యూస్ :** కురిసిన వర్షానికి గాలికి వల్లూరు గ్రామంలోని చెత్త సేకరణ డంపింగ్ యార్డ్ గేట్‌కు బుధవారం ఉదయం 6 గంటల సమయంలో విద్యుత్ తీగ తగలడంతో, ఆ గేటును తాకిన మూడు పందులు అక్కడికక్కడే మృతి చెందాయి, వివరాల్లోకి వెళ్తే, ప్రభుత్వ ఆసుపత్రి మరియు సచివాలయానికి వెళ్లే మార్గంలో ఉన్న డంపింగ్ యార్డు సమీపంలోని విద్యుత్ మెయిన్ లైన్‌పై చెట్ల కొమ్మలు పడటంతో తీగ తెగి, డంపింగ్ యార్డు గేటుపై పడింది, అదే సమయంలో అక్కడికి వచ్చిన పందులు ఆ గేట్‌ను తాకి విద్యుత్ షాక్‌తో మరణించాయి, ఈ ఘటన ఉదయం చోటు చేసుకోవడంతో స్థానికులు వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు సమాచారం అందించారు, అదృష్టవశాత్తూ, గేటు మార్గంలో ప్రజలు తిరుగుతుంటే ప్రమాదం సంభవించేదని స్థానికులు తెలిపారు, ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడకుండా పోవడం ఊపిరిపీల్చే విషయమని వారు పేర్కొన్నారు, ఇలాంటి ఘటనలు మరెప్పుడూ జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని, నోరులేని జీవాలు ఇలాగే ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు..



# రాజకీయాల్లో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించాలి

## ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ - మద్దతు పలికిన పొలిటికల్ పార్టీలు.

**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల నియోజకవర్గం లోని రాయలపురం నుండి ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం భారీర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ రయాలపురం నుంచి ఎమ్మార్వో ఆఫీస్ మీదుగా ఆర్డిఓ ఆఫీస్ వరకు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముస్లిం ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ముస్లింలను ఒక ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుంటున్నారు తప్ప ముస్లింలకు కూడా రాజకీయాల్లో స్థానం కల్పించుటకు ఏ పార్టీ కూడా కృషి చేయడం లేదని ముస్లింలు మెజారిటీగా ఉన్న ప్రాంతాల్లో ముస్లింలను రాజకీయ పార్టీలు ముస్లింలకు మద్దతు తెలుపుతూ రాజకీయ రిజర్వేషన్ కల్పించి రాజకీయ స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయ స్థానం కల్పించనిచోట ముస్లిం ఐక్యవేదిక తరపున ఇండిపెండెంట్గా పోటీ చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ముస్లింలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయంలో అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, వైఎస్ఆర్సిపి, కాంగ్రెస్, ఎస్డిపిఐ , జనసేన , కమ్యూనిస్టు పార్టీలు కూడా మద్దతుగా పాల్గొన్నాయి. ఈ ర్యాలీలో తెలుగుదేశం తెలుగుదేశం హాజ్ డైరెక్టర్ మహబూబ్ బాషా మరియు వైఎస్ఆర్సిపి రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి బాబూలాల్ మరియు టిడిపి స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ పర్వీన్ భాను, కమ్యూనిస్టు కమ్యూనిస్టు సిపిఐ నాయకులు వెంకటర వెంకటరాముడు , గఫూర్ ,ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాష్ట్ర అధ్యక్షులు జాఫర్ అలీ , రాష్ట్ర కార్మిక సభ అధ్యక్షులు కార్మికుల శాఖ అధ్యక్షులు ఇమామ్ భాష , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రెహమాన్ , రాష్ట్ర మహిళా అధ్యక్షులు సాహిబ్బి



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముంతాజ్ బేగం రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ సలావుద్దీన్ ,రాష్ట్ర కార్యదర్శి సైదులు , రాష్ట్ర అధికార ప్రతినిధి ఖలీల్ సయ్యద్ , అధికార ప్రతినిధి మరో షేక్ షేక్ షౌకత్ మరియు రాష్ట్ర సమన్వయకర్త సయ్యద్ అబ్దుల్ రషీద్ మరియు రాష్ట్ర అడ్వకేట్ లీగల్ అడ్వకేట్ బై మరియు రాష్ట్ర అడ్వకేట్ షేక్ సాదిక్ , బాబావలి రాష్ట్ర యువజన రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షులు వసీం బేగ్ రాష్ట్ర తిరుపతి జిల్లా తిరుపతి జిల్లా అధ్యక్షులు నిజాముద్దీన్ , సత్యసాయి జిల్లా అధ్యక్షులు గౌస్ ఖాన్ నంద్యాల అధ్యక్షులు సుభాన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు మాసూం వలి కోట మండల కమిటీ వాకాడు, మండలం కమిటీ సభ్యులు మరియు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# జి. ఓ నెంబర్ 11 సచివాలయ ఉద్యోగుల శ్రమ దోపిడీయే

## యునైటెడ్ వెల్ఫేర్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్టేటి సిద్దేశ్వర రెడ్డి

**కలసపాడు మేజర్‌న్యూస్ :** హెల్ఫర్ గవర్నమెంట్ ఎంప్లాయ్ అసోసియేన్ రాష్ట్ర. వర్కింగ్ ప్రెసిడెంట్ పి సిద్దేశ్వర రెడ్డి మాట్లాడుతూ గ్రామ, వార్డ్ సచివాలయ ఉద్యోగులు డోర్ టు డోర్ సర్వే ల నుండి విముక్తి కల్గించాలని ఆత్మ గౌరవం తో పాటు, మానసిక ఒత్తిడి కి గురి అవుతున్నామని నెల రోజులు పై బడి నిరసనలు తెలియజేస్తే, సచివాలయ ఉద్యోగ జేఏసీ ల తో చర్చలు జరిగిన మరుసటి రోజు, సాధారణ జాబ్ చార్ట్ తో ప్రభుత్వం అప్పగించిన ఏ పని అయినా చేయాల్సిందే అని పరోక్షంగా వాలంటీర్ విధులు అప్పగిస్తూ ఇచ్చిన జి. ఓ నెంబర్ 11 ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉప సంహరించుకోవాలని గ్రామ వార్డ్ సచివాలయ ఉద్యోగుల ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్టిటి సిద్దేశ్వర రెడ్డి డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ వాలంటీర్ మరియు సచివాలయ సిబ్బంది అనే రెండు అంగాలతో ఏర్పాటు చేసింది. వాలంటీర్ ప్రతి 50 కుటుంబాలకు వారధిలా పనిచేసి సేవలు అందిం చారు.కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వాలంటీర్ వ్యవస్థను తొలగించింది.వారి బాధ్యతలు ఎటువంటి ప్రతిఫలం లేకుండా సచివాలయ సిబ్బందికి అప్పగించబడ్డాయి.ప్రస్తుతం ఒక సచివాలయ ఉద్యోగికి వివిధ సర్వే ల పేరు తో 150-200 కుటుం బాలు కేటాయిస్తున్నారు.ఇది వాలంటీర్ కంటే మూడింతల నుండి ఐదింతల భారం.సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, ఉపాధి తదితర అన్ని రకాల సర్వేలను మాపై మోపుతున్నారు.ఈ పనులకు ఎటువంటి శిక్షణా, సదుపాయాలూ ఇవ్వలేదు.సచివాలయ ఉద్యోగులు మాతృ శాఖ పనులతో పాటు ఇతర శాఖల పనులు కూడా చేయమని మండల అధికారుల ద్వారా బలవంతం చేస్తున్నారు.డాష్‌బోర్డులు, టార్గెట్లు పేరిట పై అధికారులు వేధిస్తున్నారు. సచి వాలయ సిబ్బ ందిలో 50% మహిళలే ఉన్నారు. సర్వేలకు వెళ్లి నప్పుడు సామాజిక వేధింపులు ఎదుర్కొం టున్నారు.భద్రత సమస్యల వలన భయప డుతున్నారు.ప్రతి సర్వేలో ఆధార్, బయో మెట్రిక్, ఓటీపీలు సేకరించడం వల్ల ప్రజలు సహకరించడం లేదు.కొంతమంది సైబర్ నేరగాళ్లు సచివాలయ సిబ్బంది పేరుతో ప్రజలకు ఫోన్ చేసి మోసం చేసే అవకాశం లేకపోలేదు. క్షేత్ర స్థాయిలో ఒత్తిడి తో పని చేసే సచివాలయ ఉద్యోగుల సంక్షేమం, ఉద్యోగ ప్రయోజనాలు లాంటి అంశాల్లో ప్రభుత్వం ఎటువంటి శ్రద్ధ చూపడం లేదు.కానీ సర్వేల విషయంలో మాత్రం ఒత్తిడి పెడుతున్నారు.సర్వే పూర్తి కాలేదన్న కారణంతో విచారణ లేకుండానే కొంతమందిని సస్పెండ్ చేస్తున్నారు.ఇటీవల కొంతమంది ఉద్యోగులు తీవ్రమైన మానసిక ఒత్తిడి జయించలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఉన్నత విద్యా అర్హత కల్గిన సచివాలయ సిబ్బంది కి గౌరవ ప్రదమైన జాబ్ చార్ట్ ఇవ్వాలని, ఏ ప్రభుత్వ ఉద్యోగి కి లేని సర్వేలను సచివాలయ ఉద్యోగుల చేత చేయించడాని వ్యతిరేకస్తున్నామని, జి. ఓ నెంబర్ 11 ను రద్దు చేయాలని ప్రభుత్వం ను డిమాండ్ చేస్తున్నాము .. లేకుంటే సచివాలయ ఉద్యోగులు అందరు ఐక్య కార్యాచరణ తో న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.



# పొలతలలో ఆకాశ దీపోత్సవంతో కార్తీకమాస ఉత్సవాలు ప్రారంభం

## కాబోయే నూతన చైర్మన్ రాజారెడ్డి ఈ.ఓ. కృష్ణ నాయక్‌ల సమన్వయంతో ఆకాశ దీపోత్సవం

**పెండ్లిమర్రి మేజర్‌న్యూస్ :** శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానము, పొలతల లో కార్తీక మాసం ఉత్సవాలు బుధవారము ఉదయం ఆకాశ దీపోత్సవం తో ఘనంగా ప్రారంభమైనది. ఆలయ కార్యనిర్వహణాధికారి యం. క్రిష్ణ నాయక్ గారు మాట్లాడుతూ భక్తుల అవసరాలను దృష్టి లో ఉంచుకొని ఎలాటి ఇబ్బందులు కలుగకుండా ముందుగా అన్ని వసతులు ఏర్పాటు చేయడం జరిగింది. వృద్దులకు, చిన్న పిల్లల తల్లులకు , వికలాంగులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే దేవస్థానము తరుపున ఉచిత ప్రసాదము , అన్నదాన కార్యక్రమము ఏర్పాటు చేశారు. .మండల స్థాయి మీటింగు ఏర్పాటు చేసుకొని కార్తీక మాసం ఉత్సవాలు పై విధి విధానాలను మండల స్టాయి అధికారులతో చర్చిండం జరుగుతుందనీ త్వరలో నూతన పాలకమండలి ఏర్పాటు కాబోతున్న సందర్భంగా నూతన పాలకమండలి సభ్యులకు అందరికి శుభాకాంక్షలు తెలిపారు.. ఈ కార్యక్రమములో టీడీపీ నాయకులు శిరిగి రెడ్డి రాజా రెడ్డి , దేవస్థాన అర్చకులు, దేవస్థాన సిబ్బంది భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఘనంగా గోవర్ధనగిరి పూజ



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** స్థానిక కొర్రపాడు రోడ్డులోని రిలయన్స్ మార్ట్ సమీపంలో వున్న ఇస్కాన్ కేంద్రంలో బుధవారం గోవర్ధనగిరి పూజ, శ్రీకృష్ణుని గోవర్ధన లీలా వేడుకలను ఇస్కాన్ ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. గోవర్ధన గిరి పూజలో భాగంగా వేకువజామున మంళహారతి మంత్ర జపం, గురు పూజ, గోవర్ధన లీలా శ్రవణం, హరినామ సంకీర్తన, శ్రీకృష్ణ బలరాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు, హారతి, గోవర్ధన గిరి ప్రదక్షణ, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం నిర్వహించారు. శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని తన చిటికెన వేలుపై ఎత్తిన విధంగా ప్రత్యేక సెట్టింగ్ భక్తులను అలరించింది. పెద్ద ఎత్తున భక్తులు కార్యక్రమంలో పాల్గొని గోవర్ధన పర్వతాన్ని, శ్రీ కృష్ణ బలరాములను దర్శించుకొని అన్న ప్రసాదం స్వీకరించారు.

# విద్యుత్ పంపిణీ మేనేజింగ్ డైరెక్టర్ శివ శంకర్‌తో ఎమ్మెల్సీ మర్యాదపూర్వ కలయిక



**పులివెందుల మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శివ శంకర్ లోతేటి, ఐ.ఎ.ఎస్.ని శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మంగళవారం తిరుపతిలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏ పి ఎస్ డి సి ఎల్ నూతన సి ఎమ్ డి గా బాధ్యతలు చేపట్టిన శివ శంకర్ లోతేటి కి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. విద్యుత్ సమస్యలు, ముఖ్యంగా వ్యవసాయ కనెక్షన్లు, విద్యుత్ మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి అంశాలపై రామగోపాల్ రెడ్డి సి ఎమ్ డి తో చర్చించారు.సి ఎమ్ డి శివ శంకర్ లోతేటి ప్రజలకు మెరుగైన సేవలందించడానికి, సంస్థ లక్ష్యాలను చేరుకోవడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# రితీష్ రెడ్డి నాయకత్వం బద్వేలు నియోజన వర్గం అభివృద్ధి : మన్యం మల్లికార్జున రెడ్డి



**కలసపాడు మేజర్‌న్యూస్ :** బద్వేలు టిడిపి అంటే వీరారెడ్డి కుటుంబం, టిడిపి నాయకత్వం రితీష్ రెడ్డి కి మద్దతుగా టిడిపి యువ నాయకులు సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా యువతకు ప్రాధాన్యం ఇచ్చే యువనేత రితీష్ రెడ్డి నాయకత్వంలో పనిచేయడం బద్వేలు యువతకు వరం అని రితీష్ రెడ్డి నాయకత్వంలో టిడిపి శ్రేణులు కలిసి మెలిసి పనిచేస్తు న్నారని మన్యం మల్లికార్జున రెడ్డి తెలిపారు. పార్టీకి వెన్ను పోటు పొడిచి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి కి కారకులైన కొందరు చేసే ప్రచారం నమ్మరాదని, రితీష్ నాయకత్వాన్ని నియోజకవర్గ ప్రజలు టిడిపి కుటుంబము ఎప్పటికీ వెన్నంటు వుంటుందని మల్లికార్జున రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వినోద్ రెడ్డి, సుర భాస్కర్ రెడ్డి, గుడిమే వెంగయ్య , చిలమాల గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.


# పశువైద్య కాలేజీలో "పోలీస్ కళా-జాగృతి బృందం" నాటక ప్రదర్శన



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు బుధవారం ప్రొద్దుటూరు గ్రామీణ-పిఎస్ పరిధిలోని ప్రభుత్వ పశువైద్య కాలేజీలో పోలీస్ కళా-జాగృతి బృందం ఇన్‌ఛార్జ్ జి.నరసరామ్ వారి బృందం ఆధ్వర్యంలో "ఓయువతా... మేలుకో" పాటల మరియు నాటక ప్రదర్శన ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు గ్రామీణ సి.ఐ నాగభూషణం మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం వల్ల ప్రజలకు వచ్చే ఆరోగ్య సమస్యలు, సమాజంలోని రుగ్మతలు వాటివలన కలిగే అనర్థాల గురించి వివరించారు. మత్తు పదార్థాల ఆచూకీ తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972 కి కాల్ చేసి తెలియ జేయాలన్నారు. ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్ సి.ఐ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా వుంటూ, వారి తల్లిదండ్రులు వారిపై పెట్టుకున్న ఆశలను నేరవేర్చి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ప్రొద్దుటూరు ట్రాఫిక్ సి.ఐ రాజగోపాల్ మాట్లాడుతూ ట్రాఫిక్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉంటూ హెల్మెట్ తప్పనిసరిగా దరించాలన్నారు. అలాగే ప్రొద్దుటూరు గ్రామీణ ఎస్.ఐ అరుణ్ రెడ్డి విద్యార్థులతో "యువతా మేలుకో-మత్తు నుండి తేరుకో, డ్రగ్స్ వద్దు-జీవితం ముద్దు, మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం-భవిష్యత్తును కాపాడు కుందాం అని నినాదాలు చేయించారు. కాలేజ్ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, నేటి సమాజంలో యువత- విద్యార్థులు "డ్రగ్స్"కు దూరంగా ఉండి భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పోలీసు కళా-జాగృతి బృందం ప్రదర్శన విద్యార్థులను విశేషంగా అలరించింది. ఈ కార్యక్రమంలో కడప ఫ్యాక్షన్ జోన్ ఎస్.ఐ. సుబ్రహ్మణ్యం, నార్కోటిక్స్ ఏ.ఎస్.ఐ. మల్లయ్య, ఈగల్ టీమ్ అయూబ్, కాలేజ్ అధ్యాపకులు వారి సిబ్బంది, మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# 2026 - 27 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి పనులు గుర్తింపు

### - ఉపాధి కూలీలకు ఈకేవైసీ పూర్తి చేయించండి
### - ఉపాధి హామీ ఏపీవో లక్ష్మీనారాయణ



**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను 2026-27 సంవత్సరములు గాను కూలీలను గుర్తిం చాలని మండల ఉపాధి హామీ ఏపీవో లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. బుధవారము స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని ఎంపీడీవో సభ భవనంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామి సిబ్బందితో సమావేశం నిర్వహి ంచారు. ఈ సంద ర్భంగా ఏపీవో లక్ష్మీ నారా యణ మాట్లా డుతూ మండలంలో ఉపాధి హామీ కూలీలకు ప్రతి ఒక్కరికి ఈకేవైసీ పూర్తి చేయించాలని సిబ్బందికి తెలిపారు. అలాగే వేసవి కాలానికి ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలని తెలిపారు. సామాజిక తనకి కి ప్రతి ఒక్కరూ రికార్డులతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు,ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# బ్రహ్మంగారిమఠం మండల ప్రజల పోలీసుల విజ్ఞప్తి



**బ్రహ్మంగారిమఠం మేజర్‌న్యూస్ :** బ్రహ్మం గారిమఠం మండలం ప్రజలకు పోలీసు వారి విజ్ఞప్తి చేయ దం ఏమనగా గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురు స్తున్న వర్షాల కారణంగా పాత ఇళ్ళు, మట్టి మిద్దెలు కూలడానికి పడిపోవడానికి అవకా శమున్నందున మరియు అందువల్ల ఏమైనా జరగడానికి అవకాశం ఉన్నందున అలాంటి ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు దయ చేసి అక్కడ ఖాళీ చేసి మీకు దగ్గరలోని సురక్షితమైన ప్రదేశంలో/ఇళ్లలో ఉండాలని విజ్ఞప్తి చేసిన ఎస్ఐ శివప్రసాద్ అలాగే ఇళ్ల దగ్గర కానీ,పొలాల దగ్గర కానీ తడి చేతులతో లేక తడి బట్టలతో కరెంటు ఆన్ చేయడం ప్రమాదకరం. అలాగే ఎక్కడైనా వంకలు వాగులు దాటేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని విజ్ఞప్తి.ఏమైనా పోలీసు సహాయార్థం 91211 00624 ఈ నెంబర్ కు ఫోన్ చేయాలి.

# సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

### - ఎంపీడీవో జె. సుబ్బారెడ్డి




**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని మండల అభివృద్ధి అధికారి జె.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారము మండల పరిధిలోని ఎర్రబల్లె గ్రామ సచివాలయంను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రతిరోజూ ఉదయం 10 గంటలకల్లా సచివాలయానికి రావాలని, వారి శాఖ నిధులు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. సిబ్బంది తమ శాఖపై బయటకు వెళ్లే సమయంలో మూమెంట్ రిజిస్టర్ లో రాసి వెళ్లాలని ఆయన తెలిపారు. ప్రజలను ఆఫీస్ చుట్టూ తిప్పుకోకుండా వారి పనులను చేసి పంపాలని తెలిపారు. అలాగే పారిశుద్ధంపై పంచాయతీ కార్యదర్శి పంచాయతీ సిబ్బందితో చర్చించారు. అలాగే మాచనపల్లె పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బందితో సమావేశం నిర్వహించారు కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో హరికృష్ణ యాదవ్, పంచా యతీ కార్యదర్శి భార్గవి, వీఆర్వో చంద్రమౌళి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసంచేయద్దు

## ఎస్టియు కడప జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ భాష

**మైదుకూరు మేజర్‌న్యూస్ :** మైదుకూరు ఎస్టియు రీజియన్ కన్వీనర్ వెంకటేశ్వర రాజు అధ్యక్షతన ప్రాంతీయ సర్వసభ్య సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడప జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ భాష హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇలియాస్ భాష మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేయొద్దని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమస్యల పేరుతో ఉద్యోగులకు అన్యాయం చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు 12వ పిఆర్సి మరియు నాలుగు పెండింగ్ డిఎ ల చెల్లింపుపై కూటమి ప్రభుత్వం మీద కొండంత ఆశ పెట్టుకున్నప్పటికీ సాక్షాత్తు ముఖ్యమంత్రితో జరిపిన చర్చల తర్వాత కూడా కేవలం ఒక డిఎ ఇచ్చి కంటితుడుపు ప్రకటనగా చూడవలసి వస్తుందని. ప్రభుత్వ తీరుపై రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులు తీవ్ర నిరాశ చెందారని అభిప్రాయపడ్డారు .12వ పి.ఆర్.సి కి సంబంధించిన ఆర్థిక ప్రయోజనాలు ఎప్పటినుంచి ఇవ్వనున్నారో కూడా ప్రకటించకపోవడం ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను తీర్చడం పట్ల ప్రభుత్వం శీతకన్ను వేసినట్లు అనిపిస్తోందని



తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు పొందేలా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. అలాగే 2025 జూన్ లో బదిలీ పొందిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను,పదవీ విరమణ చెందిన ఉపాధ్యాయులను సన్మానించారు, ఈ కార్యక్రమంలో నాయకులు బాలగంగిరెడ్డి, రమణారెడ్డి, పాలకొండయ్య, రామమోహన్, మల్లేష్ రెడ్డి, వెంకట సుబ్బయ్య, సురేష్, రమేష్, చెన్నకేశవ, రమణయ్య,ఈశ్వరయ్య,నాగరాజు,కిరణ్ పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న మల్లెగుడిపాడు ఎలిమెంటరీ పాఠశాల

### ఏఐవైఎఫ్ ఏరియా నాయకులు సుజన్ కుమార్




**బ్రహ్మంగారిమఠం మేజర్‌న్యూస్ :** బ్రహ్మంగారిమఠం మండలంలోని దిగువ నేలటూరు గ్రామపంచాయతీ మల్లెగుడుపాడు ఎస్సీ కాలనీలో ఉన్న ఎలిమెంటరీ పాఠశాల శిథిలావస్థలో ఉందని చిన్న వర్షం వచ్చినా విద్యార్థులు కనీసం కూర్చోవడానికి వీలు లేకుండా భవనం మొత్తం కారుతుందని అదేవిధంగా పాఠశాల భవనం చాలా పాతదైనందువల్ల ఎప్పుడు కులుతుందో తెలియక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని మల్లెగుడుపాడు పాఠశాలకు నూతనంగా పాఠశాల నిర్మించేందుకు మైదుకూరు శాసనసభ్యులు, ఎంఈఓ చర్యలు తీసుకొని నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ మైదుకూరు ఏరియా నాయకులు పెద్దులపల్లి సుజన్ కుమార్ తెలిపారు.

## ఉపాధి హామీ పథకం ఈకేవైసీ పూర్తి చేయించండి



**బ్రహ్మంగారిమఠం మేజర్‌న్యూస్ :** ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారు తప్పనిసరిగా తమ జాబ్ కార్డుకు పనులు ప్రారంభమయ్యే ముందు ఈ కేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ కేవైసీ పూర్తి చేసినవారికి మాత్రమే ఉపాధి పనులు కల్పించబడతాయి. కాబట్టి, అందరు లబ్ధిదారులు వెంటనే తమ జాబ్ కార్డు కు పూర్తి చేయించుకోవలసిందిగా తెలిపారు. ఇంకా వివరాలు తెలుసు కోవాలంటే ఫీల్డ్ అసిస్టెంట్లను కలిసి తెలుసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీవో హరికృష్ణ ఉన్నారు .

## ఎస్టీయు మండల అధ్యక్షునిగా పి.ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శిగా పి. రవి కుమార్ రెడ్డి



ఈశ్వరయ్య .రవికుమార్ రెడ్డి .మురళీ కృష్ణ

**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** ఎస్ టి యు మండల కార్యవర్గం నియమించినట్లు అధ్యక్ష కార్యదర్శులు ఈశ్వరయ్య, రవి కుమార్ రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం రాష్ట్రోపాధ్యాయ సంఘము మైదుకూరు రీజియన్ సమావేశం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ కళ్యాణ మండపం మైదుకూరు నందు జరిగినది. ఈ సమావేశంలో ఎస్టీయు దువ్వూరు మండల అధ్యక్షులుగా పి.ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శిగా పి.రవికుమార్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా టి.మురళీ కృష్ణ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఖైజర్, గౌరవ అధ్యక్షులుగా సి.వీరారెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా వెంకటేశ్వర బాబు, రామయ్య, నాగేంద్ర, నాగరాజు, రమేష్ బాబు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాషా, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలగంగిరెడ్డి,రమణారెడ్డి, స్టేట్ కౌన్సిలర్ పాలకొండయ్య, రీజయన్ కన్వీనర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## బద్వేల్ తెదేపా పార్టీ రితీష్ రెడ్డి తోనే బలోపేతం

### కలసపాడు తెదేపా ఉపాధ్యక్షుడు పట్టాభి రెడ్డి



**కలసపాడు మేజర్‌న్యూస్ :** రితీష్ రెడ్డి తోనే బద్వేల్ నియోజకవర్గంలో టీడీపీకి పార్టీకిపూర్వ వైభవాన్ని తీసుకొచ్చే శక్తి సామర్థ్యాలు రితీష్ రెడ్డికే ఉన్నాయని కలసపాడు మండల తెదేపా ఉప అధ్యక్షుడు పట్టాభిరెడ్డి బుస్కే శ్రవణ్ కుమార్ రెడ్డి వీరారెడ్డి రసూల్ తెలిపారు మీడియాతో వారు మాట్లాడుతూ టీడీపీ పార్టీ ప్రారంభం నుంచి పార్టీకోసం అహర్నిశలు కృషి చేస్తున్న దివంగత మంత్రి బిజివేములవీరారెడ్డి కుటుంబానికి బద్వేల్ ప్రజల మద్దతు ఎప్పటికి ఉంటుందన్నారు. పార్టీ కష్ట కాలంలో వున్న సమయంలో పార్టీని నమ్ముకున్న కార్యాకర్త లకు అండగా వుండి బద్వేల్ నియోజకవర్గంలో పార్టీని నడిపించించిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ గారిని బద్వేల్ టీడీపీ శ్రేణులు మరిచిపోలేరన్నారు. ప్రజలు అడిగిందే తడువుగా అభివృద్ధి పనులు చేయిస్తున్న వీరారెడ్డి వారసులు రితీష్ రెడ్డి తోనే పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఓటర్లు వున్నారన్నవిషయాన్ని అయన గుర్తుచేశారు.టీడీపీ సంపూర్ణ మద్దతు రితీష్ రెడ్డి కి ఇస్తున్నట్లు పట్టాభి రెడ్డి శ్రవణ్ కుమార్ రెడ్డి వీరారెడ్డి రసూల్ ప్రకటించారు

## రిమ్స్ ఆవరణలో ఏఎన్ఎం స్కూల్ బిల్డింగ్‌లో విద్యుత్ లేక విద్యార్థులు, సిబ్బందికి తీవ్ర ఇబ్బందులు

**రిమ్స్ కడప మేజర్‌న్యూస్ :** కడప: రిమ్స్ (రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆవరణలోని ఏఎన్ఎం (సహాయ నర్సింగ్ మిడ్వైఫరీ) స్కూల్ బిల్డింగ్‌లో గత రెండు రోజులుగా విద్యుత్ లేకపోవడం కారణంగా విద్యార్థులు మరియు వర్కింగ్ స్టాఫ్ నర్సులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ లేక నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. తాగడానికి నీరు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అంతే కాకుండా రాత్రి సమయంలో నిద్రపోవడం కూడా కష్టంగా మారింది. ఇక్కడే తాత్కాలికంగా వుండే వర్కింగ్ స్టాఫ్ నర్సులు కూడా తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. కరెంటు లేక వంట చేయడానికి నీరు అందక, వారి దైనందిన కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. రెండు రోజులుగా ఈ సమస్యను అధికారులకు తెలియజేసినప్పటికీ వారు పట్టించుకోకపోవడంపై నర్సింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు, సిబ్బంది సమస్యలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్, నీటి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉందని అక్కడి బాధితులు కోరుతున్నారు.

## వేమలూరు వంతెన పై తగ్గిన నీటి ప్రవాహం రాకపోకలు సుగమం

### వంతెన పైకి నీళ్లు మళ్లీ రాకుండా అధికారులు చేయాలి ప్రజలు



**అట్లూరు, మేజర్‌న్యూస్ :** అట్లూరు మండలం లోని వేమలూరు వంతెనపై నిలువ ఉన్న సోమశిల ముంపు జలాల నీరు తగ్గిపోయింది బుధవారం సోమశిల డ్యామ్ లో గేట్లు ఎత్తడంతో వంతెన పై నీరు మొత్తం తగ్గిపోయింది సోమశిల డ్యామ్ లో బుధవారం నీటి మట్టం 69 టీఎంసీలు నిలువ ఉంచడంతో వంతెనపై రాకపోకులకు మార్గం సుగుమం అయింది వేమలూరు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు వాహనదారులు వంతెన పై వెళ్తుంటే పాచిపట్టి బైక్ లు జారుతున్నాయి వంతెనపై వెళ్లేటప్పుడు జాగ్రత్తగా వెళ్లాలని పలువురు సూచిస్తున్నారు అయితే ఐదు రోజులు భారీవర్షాలు ఉన్న నేపథ్యంలో సోమశిల గేట్లు ఎత్తేసారని అందువల్లనే వంతెన పై నీరు మొత్తం పోయిందని గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు సోమశిల డ్యామ్ లో 69 టిఎంసిలు ఉంచితే వాహనాల రాకపోకలకు ఏ ఇబ్బంది లేకుండా ఉంటుందని చుట్టూ నలభై కిలోమీటర్లు తిరిగి కడపకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండదని వంతెనపైకి నీళ్లు మళ్లీ రాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేయాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు

## తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**చెన్నూరు (మేజర్‌న్యూస్) :** తుపాను ప్రభావం నేపథ్యంలో మండల ప్రజలకు తక్షణ సమాచారం అందించేందుకు చెన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సరస్వతీ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు.వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో చెన్నూరు మండలంలో తుఫాన్ పరిస్థితులపై నిరంతర నిఘా ఉంచేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మండలంలోని పెన్నా పరిసర గ్రామాల పర్యవేక్షణ కోసం ఆయా గ్రామాల వీఆర్‌ఓలకు ప్రత్యేక విధులు అప్పగించినట్లు వివరించారు.గ్రామాల స్థాయిలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వర్షాలు మరియు గాలుల తీవ్రత పెరిగినప్పుడు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఆమె సూచించారు.ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా ప్రజలు ఆయా విఆర్‌ఓలకు లేదా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని తహసీల్దార్ కోరారు.

# ధనలక్ష్మి దేవిగా వాసవిమాత భక్తులకు దర్శనం



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** స్థానిక అమ్మవారిశాలలో ధనలక్ష్మి దేవిగా వాసవిమాత భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటం శెట్టి చంద్రశేఖర్ వెల్లడించారు. బుధవారం దీపావళి పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో వాసవిమాతకు ధనలక్ష్మి పూజ చేసి, నగదు, బంగారు, వెండి ఆభరణాలతో కల్పవృక్ష సమేత శ్రీధనలక్ష్మి దేవిగా అలంకరించినట్లు అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మ వివరించారు. ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, మాజీ అధ్యక్షుడు హరికృష్ణ, ఆలయ నిర్వాహకుడు మిట్టామోహన్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అష్ఫఖుల్లా ఖాన్ జయంతి వేడుకలు




**ఖాజీపేట, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన ఖాజీపేట బస్టాండ్ సెంటర్‌లో బుధవారం భారత స్వాతంత్ర్య సమరయోధుడు అష్ఫఖుల్లా ఖాన్ 125వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ నాయకుడు షేక్ హాజీగౌస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా హాజీగౌస్ మాట్లాడుతూ "అష్ఫఖుల్లా ఖాన్ 22 అక్టోబర్ 1900న ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్పూర్‌లో జన్మించారనీ, బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడి దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను అర్పించిన మహానుభావుడని అన్నారు.దేశ స్వేచ్ఛకోసం ఉరిశిక్షను భయపడకుండా ఎదుర్కొన్న అష్ఫఖుల్లా ఖాన్ త్యాగాలు యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మహబూబ్ బాషా, టీ.రమణ, రచయిత షేక్ఇంతియాజుద్దీన్‌లు పాల్గొన్నారు.


# ఉద్యోగుల విషయంలో మాట తప్పిన ప్రభుత్వం

### ఆరోగ్యశ్రీ పథకానికి అనారోగ్యం
### ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్ తులసిరెడ్డి



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** ఉద్యోగుల విషయంలో సిఎం చంద్రబాబు నైతృత్వంలోని కూటమి ప్రభుత్వం మాట తప్పిందని ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్ తులసిరెడ్డి ధ్వజమెత్తారు. ఇంతన్నడంతన్నడే గంగరాజు, ముంతమామిడి పండన్నాడే గంగరాజు అని తప్పుచేసి పప్పుకూడు సినిమాలోని పాట లాగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఉద్యోగస్తులకు అనేక హామీలిచ్చారని తులసిరెడ్డి ఘాటుగా స్పందించారు. అధికారంలోకి వచ్చి పదహారు నెలలైన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే వీరికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకం అనారోగ్యశ్రీగా తయారైందని, పెండింగ్ బకాయిలు చెల్లించి, ఆ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్నాథరెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, నాగరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద దర్గా ఉరుసుకు సంకేతంగా నేడు ఫకీర్లతో ఊరేగింపు



**కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్:** కడప పెద్ద దర్గా ఉరుసుకి సంకేతంగా ఒక పూల జ్వాలానీ ఊరేగింపు గురువారం నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ తెలిపింది. రాత్రి 10 గంటలకు కడప పురవీధుల్లో ఊరేగింపుగా ఫకీర్లతో మేళ తాళాలతో శిష్యులతో నగరంలోని పురవీధుల గుండా ఊరేగింపుగా కడప దర్గాకు విచ్చేసి సర్వసంగ పరిత్యాగి జీవ సమాధి అయినటువంటి హజరత్ పీరుల్లా మాలిక్ గుమ్మదుపైన సమర్పించి దక్షిణ భారతదేశపు సూఫీ గురువైనటువంటి హజరత్ ఖ్వాజా బందా నవాజ్ గుల్బర్గా రహమతుల్లాలై వారి పేరు మీద 11వ పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరీఫుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేనీ చిష్టి ఉల్ ఖాదరి గారు ఫాతిహా చదింపులు ఇస్తారని తెలిపారు.

# వర్షం పడిందా - లేక హాస్పిటల్ కారిందా

### లక్షల ఖర్చుతో ముస్తాబు చేసిన హాస్పిటల్ నాలుగేళ్లకే మట్టిలో
### ప్రభుత్వం గొప్పలు చెబుతోంది - కింద ఫ్లోరింగ్ అంత నీరు కారుతోంది
### ఇది ఆరోగ్య కేంద్రమా - లేక నీటి ప్రాజెక్టా




**వల్లూరు, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర పేరిట గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య రంగ అభివృద్ధికి గొప్ప కార్యక్రమాలు చేపట్టిందని గర్వంగా ప్రకటిస్తుండగా, వల్లూరు మండల ప్రజలకు మాత్రం వర్షం కురిసిన ప్రతీసారి హాస్పిటల్ గదుల్లో కారే నీటి వల్ల పీడా తప్పడం లేదు, మండలానికి ప్రధానంగా పనిచేస్తున్న వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (%ూఎజ%) ఒక్క పగలు, ఒక్క రాత్రి కురిసిన వర్షానికి పూర్తిగా నీటిమయంతో కింద ఫ్లోరింగ్ అంతా తడుస్తుంది, ఈ కేంద్రంలో ఉన్న ప్రతి గది, ఓపీ హాలు, డాక్టర్ల గది, మెడిసిన్ స్టోర్, డెలివరీ రూమ్, వ్యాక్సిన్ గది, రక్త పరీక్ష గది, బాటిల్స్ పెట్టె గది, పేషెంట్లు వేచి ఉన్న హాలు అన్నింట్లోనూ నీరు చేరి కింద ఫ్లోరింగ్ అంతా తడుస్తూ ఉండిపోయింది, వైద్య సిబ్బంది క్లీనింగ్ చేస్తే మళ్లీ వర్షం పడుతుంది, ఇలా రోజంతా కష్టమే, హాస్పిటల్ లోపలే పేషెంట్లు నిలబడలేని పరిస్థితి, వచ్చే పేషెంట్లు ఎక్కడ నిలబడాలో, ఎక్కడ వెయిట్ చేయాలో అర్థం కాని పరిస్థితి ఇది ఒక ఆరోగ్య కేంద్రంగా ఉండాలా, లేక అబద్ధపు పేరుతో నడుస్తున్న కాంపౌండ్‌గా ఉండాలా అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు, ప్రతిరోజూ డజన్ల సంఖ్యలో పేషెంట్లు వివిధ సమస్యలతో ఇక్కడకు వస్తున్నారు, చిన్న పిల్లల వ్యాక్సినేషన్, గర్భిణుల ఆరోగ్య పరీక్షలు, ఫార్మసీ సేవలు, బాటిల్స్ వేసే చికిత్సలు అన్నింటికీ ఇది ఒకే కేంద్రం కావడంతో ఆరోగ్యం బాగాలేని ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, గత ప్రభుత్వంలో 2020–2022 మధ్య లక్షల రూపాయలు ఖర్చు చేశారు, మరమ్మతులు చేశారని ప్రజలు చెబుతున్నారు, అయినా కేవలం నాలుగేళ్లలోనే హాస్పిటల్ వర్షానికి నిలబడలేని స్థితిలోకి చేరడం బాధాకరమని విమర్శిస్తున్నారు, ప్రభుత్వం వైద్య రంగ అభివృద్ధి గురించి గొప్పగా చెబుతోంది, వైద్య సేవల విస్తరణలో రాష్ట్రం దేశంలోనే ముందుందని చెబుతోంది, కానీ ఈ హాస్పిటల్ పరిస్థితి చూస్తే, ఆ అభివృద్ధి కేవలం ప్రకటనలకే పరిమితమైందా అన్న అనుమానం కలుగుతోంది, ప్రభుత్వం బాగానే చేస్తోంది, కానీ అధికారులు ఏమయ్యారు, ప్రభుత్వ ఆరోగ్య విధానాలు అభినందనీయమే. నాణ్యమైన మెడిసిన్ అందుతోంది, డాక్టర్లు, నర్సులు తమ విధులు నిర్వహిస్తున్నారు, అయినా, గదులన్నీ కరకట్టలుగా మారితే ప్రజల విశ్వాసం ఎలా పెరుగుతుంది, ప్రతి గదిలో ఎక్కువ మీరు పడుతున్న దగ్గర బకెట్ లు పెట్టి నీరు పారబోసే పరిస్థితి ఏర్పడింది, ఇది ఎవరి నిర్లక్ష్యం, పేషెంట్లు ప్రైవేట్ హాస్పిటల్స్‌కే పరుగెడుతున్నారు, ఇది అవగాహనలేమి కాదు అవమానమే,




### వల్లూరు ప్రజల డిమాండ్ వెంటనే చర్యలు తీసుకోవాలి

వల్లూరు మండలానికి ఇదే ఒక్కటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇది ఎన్నో ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్న స్థలం, ఇంత పేరుగల హాస్పిటల్‌ను ఈ విధంగా నిర్లక్ష్యం చేయడం అధికారుల అవహేళనకు నిదర్శనం అని మండల ప్రజలు మండిపడుతున్నారు, దీనిపై అధికారులు స్పందించి వెంటనే నిధులు కేటాయించి, శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, ప్రజల ఆరోగ్య హక్కులను కాపాడాలని కోరుతున్నారు..

# ధ్వజ స్తంభంపై ఆకాశదీపం

### వెల్లాలలో కార్తీకమాస పూజలు



రాజుపాళెం, మేజర్‌న్యూస్: త్రేతా యుగం నాటి చరిత్ర కలిగిన శ్రీ చెన్నకేశవ సంజీవరాయ స్వామి ఆలయ ఆవరణంలోని శ్రీ భీమలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం కార్తీక మాస పూజలు ఘనంగా నిర్వహించారు ధ్వజస్తంభంపై తాడు సహాయంతో ఆకాశ దీపాన్ని వేళాడదీశారు ఈ ఆకాశ దీపం శివకేశవులు యొక్క తేజస్సును జగత్తుకు అందిస్తుందని భక్తుల నమ్మకం ఇక్కడ కొలువై ఉన్న వరసిద్ధి వినాయక వీరభద్ర పార్వతి దేవి అమ్మవారు శ్రీ భీమలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు అక్కడే ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి.అనంతరం ఆకాశం దీపం వెలిగించే కార్యక్రమంలో ఆలయ అర్చకులు చలపతి ఉత్సవ కమిటీ సభ్యులు గంగిరెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డి దంపతులు పాల్గొన్నారు


# పాత మట్టి మిద్దెలతో ముప్పు

### వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి– ఎస్ఐ వెంకటరమణ



**రాజుపాళెం, మేజర్‌న్యూస్:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పాత మట్టి మిద్దెలు కూలే అవకాశం ఉందని అందుకు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాజుపాళెం ఎస్ఐ వెంకటరమణ సూచించారు. వర్షాల వల్ల పాత ఇల్లు మట్టి మిద్దెలు కూలెందుకు అవకాశం ఉంటుందని వాటిని ఖాళీ చేసి సురక్షితమైన ఇళ్లల్లో ఉండాలని విజ్ఞప్తి చేశారు ఇండ్ల పొలాల దగ్గర తడి చేతులు బట్టలతో విద్యుత్తు పరికరాలను ఆన్ చేయడం ప్రమాదకరమన్నారు వర్షాలు మరింత ఎక్కువైనప్పుడు సమీప గ్రామాల్లోని వంకలు వాగులు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందువల్ల వాటిని దాటేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు మండల ప్రజలకు ఏదైనా సహాయం కావలసినప్పుడు పోలీసు వారికి తెలపాలన్నారు.

# వర్షాలతో కూలిన మిద్దె

**ఎర్రగుంట్ల, మేనేజర్‌న్యూస్:** తుఫాను కారణంగా కురుస్తున్న అధిక వర్షాలతో స్థానిక పురపాలక పరిధిలోని ప్రకాష్ నగర్ కాలనీలో ఓ పాత మిద్దె కూలిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. డి. లక్ష్మీదేవి మహిళకు చెందిన మిద్దె కురుస్తున్న వర్షాల వల్ల మట్టి తడిసి దూలాలు విరిగిపోయి కూలిపోయింది. మిద్దె కూలిన సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇంటిలో ఉన్న కొన్ని విలువైన సామాగ్రితో పాటు సరుకులు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం తనను ఆదుకొని గృహ నిర్మాణానికి సహాయం అందించాలని లక్ష్మీదేవి వాపోతోంది.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com
గత 19 సంవత్సరాలుగా దిగ్విజయంగా నడుపబడుతున్న
నేటి దినపత్రిక సూర్యకు
విలేకరులు కావలెను.
కడప జిల్లా : జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం, కొండాపురం, తొండూరు, చక్రాయపేట, వి.ఎన్.పల్లి, గోపవరం
సంప్రదించాల్సిన నెంబర్లు :
9985763242, 8885763242,

# పేరుకే ప్రజా సమస్యల పరిష్కార వేదిక.. క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలు ఎన్నో

## వర్షాలకు కంపచెట్లు అంతకంతా పెరిగి ప్రమాదకరంగా మారిన ఓబుళాపురం-వరికుంట్ల ప్రధాన రహదారి...

## ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సంబంధిత అధికారులు...


## ప్రజల ప్రాణాలు పోయాక స్పందిస్తారేమో వేచి చూడాలి...

## సంబంధిత అధికారులు ఇప్పటికైనా నిద్రమత్తు వీడి మండలంలోని సమస్యలను పరిష్కరించాలి

**కాశినాయన అక్టోబర్ 22 మేజర్‌న్యూస్ :** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.జిల్లాలోని ప్రజలు ఎంతో ఆశతో తమ తమ సమస్యలను పరిష్కరిస్తారని అక్కడికి వెళ్లి సమస్యలను జిల్లా అధికారులకు విన్నవించుకుంటున్నారు.జిల్లా అధికారులు ప్రజల సమస్యలను పరిశీలించి ఆయా శాఖల అధికారులకు సమస్యలను పరిష్కరించమని ఆదేశాలు జారీ చేస్తారు.ఆయా శాఖలకు సంబంధించిన జిల్లా స్థాయి అధికారులు డివిజన్ స్థాయి అధికారులకు అదేశాలు జారీ చేస్తారు.డివిజన్ స్థాయి అధికారులు మండల స్థాయి అధికారులకు సమస్యను పరిశీలించి పరిష్కరించాలని అదేశిస్తారు.గ్రీవెన్స్ లో నమోదైన సమస్యలపై డివిజన్,మండల స్థాయి అధికారులు తూ తూ మంత్రంగా పరిశీలించి అర్జీ దారు తో సమస్యపై చర్చించి సమస్యను తొందరలోనే పరిష్కరిస్తామని కళ్ళ బొల్లి కబుర్లు చెప్పి అర్జీదారు నుంచి సంతకాలు,ఫోటోలు సేకరిస్తారు.సేకరించిన సంతకాలను,ఫోటోలను తీసుకొని సమస్యను పరిష్కరించినట్లు పై అధికారులకు నివేదిక ను అప్పచెప్పి చేతులు దులుపుకుంటున్నారు.క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదు.

### క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం శూన్యం..

ఇటీవల కాశినాయన మండలంలోని ప్రజలు పలు సమస్యలను గ్రీవెన్సులో జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్యలు పరిస్కారం కాలేదని ప్రభుత్వం పట్ల,అధికారుల పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.జ్యోతి క్షేత్రానికి వెళ్లే ప్రధాన రహదారి ఓబుళాపురం-వరికుంట్ల వరకు గత రెండు సంవత్సరాలుగా గుంతలతో అద్వాన్నంగా తయారయ్యి,రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతూ ప్రతి రోజు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు కడప కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అదిథి సింగ్ దృష్టికి తీసుకెళ్లారు.జాయింట్ కలెక్టర్ ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని జిల్లా %=ఢదీ% అధికారులను ఆదేశించారు. జిల్లా,డివిజన్,మండల స్థాయి అధికారులు ఈ సమస్యపై స్పందించి క్షేత్రస్థాయిలో 4,5 కిలోమీటర్ల మేరా ఉన్న గుంతలను,రోడ్డు కు ఇరువైపులా 6 కిలోమీటర్ల మేరా ఉన్న కంపచెట్లను తొలగించకుండా 2,3 గుంతలను పూడ్చి,4,5 కంపచెట్లను తొలగించి సమస్యను పూర్తిగా పరిష్కరించినట్లు వారికై వారే ఊహించుకొని చేతులు దులుపుకొన్నారు.కనీసం గుంతలను పూడ్చి ,కంపచెట్లను తొలగించక పోవడం,ప్రజల చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కారం కాకపోవడం బాధాకరమని ప్రజలు చింతిస్తున్నారు.జిల్లా అధికారులు




ఒకసారైనా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించబడ్డాయా అని తెలుకుంటే బాగుండని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### యధాతధంగా ఎక్కడి పనులు అక్కడే

మండలంలోని గొంటువారిపల్లె లో "అంగన్వాడీ కేంద్రం" 2 సంవత్సరాలుగా పూర్తి స్థాయికి వచ్చి నిలిచిపోయిందని,పిల్లలు అద్దె ఇంట్లో చదువును అభ్యసిస్తున్నారని,అద్దె ఇండ్లు కూడా పెచ్చులు ఊడుతూ ప్రమాదంగా మారి పిల్లల ప్రాణాలను పణంగా పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు గ్రీవెన్సులో జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ సమస్యపై కూడా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు.మండల అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి,ఆ సమస్యను పూర్తిగా పరిష్కరిస్తాము అని కల్లబొల్లి కబుర్లు చెప్తున్నారు తప్ప సమస్యను ఇంతవరకు పరిష్కరించకపోవడం గమనార్హం..అధికారులకు నివేదికలు సమర్పించుకుంటున్నారు తప్ప క్షేత్ర స్థాయిలో ఏవిధంగా ఉన్న సమస్యలు యధాతధంగా ఉండటం బాధాకరమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత అధికారులు ఇప్పటికైనా నిద్రమత్తు వీడి వెంటనే సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# విధి నిర్వహణలో అమరుడైన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి సి.ఐ. బాలమద్దిలేటి పరామర్శ




**చింతకొమ్మదిన్నె మేజర్‌న్యూస్ :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ సిబ్బంది కుటుంబాలను పరామర్శించే కార్యక్రమం జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ (ఐ.పి.ఎస్) ఆదేశాల మేరకు నిర్వహించబడింది.ఈ క్రమంలో చింతకొమ్మదిన్నె సీఐ బాలమద్దిలేటి విధి నిర్వహణలో అమరుడైన హెడ్ కానిస్టేబుల్ ఎం. లక్ష్మీనారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులను అభిముఖంగా కలుసుకుని మనోస్థైర్యం కల్పించారు. రేడియో స్టేషన్ సమీపంలో విధి నిర్వహణలో ఉన్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ మృతి చెందడం బాధాకరమని సీఐ అన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. పోలీస్ శాఖ కుటుంబానికి అండగా నిలుస్తుందని ఎటువంటి అవసరమైనా తమను సంప్రదించవచ్చని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమం లో సి. ఐ. తో పాటు సిబ్బంది విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

# గార్మి పండుగ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ



**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల పట్టణం మెయిన్ బజార్ లో ఉన్న హుస్సేన్ స్వామి దర్గా లో బుధవారం గ్యార్మి పండుగ మహోత్సవంలో ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయ కర్త రమణారెడ్డి మండల ఉపాధ్యక్షులు సీఎం భాష రంగసముద్రం మరియు పులివీడు పంచాయతీ సర్పంచ్లు చిత్త రవి ప్రకాష్ రెడ్డి తిమ్మారెడ్డి రఘునాథ్ రెడ్డి గాజుల పల్లె రవిచంద్ర రెడ్డి ఎంపీటీసీ ఇషాక్ మరియు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు

# 30వ తేదీ నుంచి రిలే నిరాహార దీక్షలు

## ఎన్ఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు పివి శివారెడ్డి



**కడప టౌన్,మేజర్‌న్యూస్ :** కడపజిల్లా వ్యాపితంగా దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారం కొరకు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ ఆధ్వర్యంలో మెమొరాండం సమర్పించటం జరిగింది. మెమొరాండం సమర్పించి దాదాపుగా నెలన్నర రోజులు గతుస్తున్నా నేటి వరకు చర్చలకు పిలవవలేదని ఎన్.ఎఱు.యు.ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు పివి శివారెడ్డి అన్నారు.ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపినా, డిపో గేట్ మీటింగ్స్ నిర్వహించినా డి.పి.టి.ఓ మొండి వైఖరి వహించి సమస్యలు పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకోవడం లేదు. మీరు ఏమి చేసినా నేను మీతో చర్చించను, పరిష్కారం చేయను" అని భీష్మించుకున్నారు. ప్రభుత్వ గుర్తింపు సంఘం, జిల్లాలో అతి పెద్ద యూనియన్ అయిన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ నాయకులను అగౌరవ పరుస్తూ చర్చలకు కూడా పిలువలేదు. అందువల్ల జిల్లాలోని ఉద్యోగస్థులు తీవు ఇబ్బందులు పడుతున్న పట్టించుకోవటం లేదు. సంస్థ నిబంధనలను పాటించకుండా, తప్పులు చేస్తున్న డిపో మేనేజర్లను, సూపర్వైజర్లను వెనుకేసుకుంటూ వచ్చి వారిని కాపాడుకుంటున్నారు. కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ఉద్యోగస్థులను వేధింపులకు గురి చేస్తున్నారు. ఈనెల 30 తేదీ నుంచి రిలే నిరాహార దీక్షలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజినల్ అధ్యక్షులు నాగమణి, కార్యదర్శి సుధాకర్, జోనల్ నాయకులు సుబ్బారావు, వలి తదితరులు పాల్గొన్నారు

# జీవితంపై విరక్తి చెంది మృతి చెందిన కల్వకురి నాయుడు బాబు.

## కేసు నమోదు చేసిన ఎస్ఐ కొండారెడ్డి

**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం కమ్మవారిపల్లి గ్రామం చెంచు కాలనీకి చెందిన కల్వకూరి నాయుడు బాబు 37 సం"లు తనకు వ్యవసాయం మరియు వ్యాపారంలో బాగా నష్టాలు రావడంతో జీవితం పై విరక్తి చెంది 18 వ తేది గడ్డి మందు త్రాగినందున కుటుంబ సభ్యులు పోరుమామిళ్లలోని ఓఎల్ఎఫ్ ఆసుపత్రికి తీసుకెళ్ళి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కొరకు నెల్లూరు లోని కిమ్స్ హాస్పిటల్ లో చేర్పించి చికిత్స ఇప్పించినప్పటికీ గడ్డి మందు త్రాగడం వలన కోలుకోలేక బుధవారం చనిపోయాడని పోరుమామిళ్ల మండలం కమ్మవారిపల్లి కు చెందిన అతని తల్లి కలవకూరి లక్ష్మమ్మ 67 సం"లు ఫిర్యాదు మేరకు పోరుమామిళ్ల ఎస్సై కొండారెడ్డి కేసు నమోదు చేశారు.

# అష్ఫకుల్లాఖాన్ స్పూర్తితో విభజన హామీల సాధన కోసం పోరాడుదాం

### డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్



**కడప ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** దేశ స్వాతంత్రం కోసం పోరాడి వీరమరణం పొందినటువంటి అస్ఫాఖుల్లా ఖాన్ స్ఫూర్తితో విభజన హామీల సాధన కోసం పోరాడదాం అని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. బుధవారం నాడు అస్ఫకుల్లాఖన్ జయంతిని పురస్కరించుకొని కడప నగరంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ నందు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్ఫఖుల్లాఖాన్ 1900ల సంవత్సరంలో అక్టోబర్ 22న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జన్మించారన్నారు. చిన్నతనం నుండే దేశంపై అమితమైన ప్రేమతో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటంలో భాగస్వామ్యం అయ్యాడు అన్నారు..విభజన హామీలు అమలు పరచడంలో కేంద్రం పూర్తిగా విఫలం చెందిందని వాటిని సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా వైఫల్యం చెందిందన్నారు. మోదీ కర్నూలుకు వచ్చిన సందర్భంలో కడప ఉక్కు పైన గానీ, రాయలసీమకు ప్యాకేజీ విషయం కానీ,విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విషయం గాని,రాష్ట్రానికి హెూదా విషయంలో గానీ ఒక్కటి మాట్లాడకుండా వెళ్లిపోవడం జరిగిందని ఇది ముమ్మాటికి ఆంధ్రా రాష్ట్ర ప్రజలను మోసగించడమే అన్నారు..వీటి పై రాష్ట్ర ప్రభుత్వం పోరాడకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు అన్నారు. స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో విభజన హామీల సాధన కోసం పోరాడదాం అని యువత కలిసే రావాలని పిలుపునిస్తాము అన్నారు.

## 23 నుంచి పాఠశాలల్లో ఆధార్ నమోదు కేంద్రాలు

### ఎంపీడీవో గౌస్ భాష



కమలాపురం, మేజర్‌న్యూస్: ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు మండలం పరిధిలోని పాఠశాలలో మొబైల్ ఆధార్ కేంద్రములు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో గౌస్ బాషా తెలిపారు బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమలాపురం మండల పరిధిలోని ఆయా పాఠశాలల యందు 23"నుంచి 30వరకు 8 రోజులు ఆధార్ క్యాంపు నిర్వహింస్తునామన్నారు ఈ ఆధార్ క్యాంపులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దచెప్పాలి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దేవరాజుపల్లి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పందిళ్లపల్లి మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సంబటూరు యందు ఆధార్ నమోదు చేయు నిమిత్తం మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.కేంద్రాలు ఆయా పాఠశాలల యందు. ఆధార్ కేంద్రాలలో డిజిటల్ అసిస్టెంట్ కు అప్లికేషన్ నమోదు చేయుటకు సచివాలయములకు సంబంధించిన మహిళా పోలీసును సహాయముగా మరియు ఆయా సచివాలయ కార్యదర్శులు అందరూ మీకు సంబంధించిన ఏరియా నందు మీ సిబ్బందితో సమాచారం అందించి ఆధార నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు ఈ ఆధార్ కేంద్రాలలో 5 నుండి 15 సంవత్సరముల వారికి ఆధార్ కార్డు అప్డేట్ చేయబడునున్నారు 15 సంవత్సరములు పై బడిన వారికి ఆధార్ కార్డు అప్డేట్ చేయుట మరియు ఆధార్ కార్డు నందు చిరునామా ఫోటో. ఫోన్ నెంబర్ లింక్ చేసుకొనుట మరియు వేలిముద్రలు అప్డేట్ చేసుకొనుటకు అవకాశం కలగని విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### వేంపల్లె సీఐ టి.నరసింహులు

**వేంపల్లె, మేజర్‌న్యూస్:** ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేంపల్లె సీఐ టి.నరసింహులు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలు, పులివెందుల డిఎస్పీ మురళి నాయక్ సూచనల మేరకు ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయట వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ కోరారు. విద్యుత్ తీగలు, పోల్ ల నుంచి దూరంగా ఉండాలని, తమ ఇంటి చుట్టుపక్కల వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ సదుపాయాలను శుభ్రం చేసుకోవాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. నదులు, వాగులు పొంగి పోర్లే అవకాశం ఉన్నందున తీర ప్రాంతాల వద్దకు వెళ్లకూడదని తెలిపారు. అంతేకాకుండా పిడుగుల సమయంలో చెట్ల కింద, ఓపెన్ ప్రదేశాల్లో నిలబడకూడదని, కిటికీలు, తలుపులు మూసి సురక్షితంగా ఉండాలని సూచించారు. జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ఎప్పుడూ సిద్ధంగా ఉన్నారన్నారు.

# విద్యార్థిపై దాడి చేసిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

### విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్

**కడప ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి సుశాంత్ ని రక్త గాయాలు అయ్యేలా ప్లాస్టిక్ పైపుతో కొట్టిన తెలుగు ఉపాధ్యాయుడు నారాయణస్వామి ని వెంటనే సస్పెండ్ చేయాలని కడప జిల్లా విద్యాశాఖ%బ% అధికారి శంషుద్దీన్ కి విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి, ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, డి.వై.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, పి.డి.ఎస్.యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకన్న, పి.ఆర్.ఎస్.వై.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శంకర్, పి.ఎస్.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఆర్.ఎమ్.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి ఆర్.ఎన్ రాజా, ఎస్.ఎఫ్.ఐ మాజీ జిల్లా కార్యదర్శి గండి సునీల్ కుమార్, ఏ.ఐ.ఎస్.బి జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్ లు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారిని ప్రయోజకులను చేయాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థులను రక్తం వచ్చేలాగా కొట్టడం చాలా దారుణం అని వారు అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు నడవడికలు నేర్పే ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల కక్ష్య పూరితంగా వ్యవహరిస్తూ రాక్షసులుగా ప్రవర్తిస్తున్న సంఘటనలు జిల్లాలో రోజు రోజుకు అధికమవుతున్నాయి అని వారు అన్నారు. విద్యార్థులపై దాడి చేసిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలల్సిన జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు మళ్ళీ మళ్ళీ జరుగుతున్నాయన్నారు. విద్యార్థిని రక్త గాయాలు అయ్యేలా కొట్టిన



ఉపాధ్యాయుడిపై విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తే ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి విద్యార్థి పక్షాన నిలబడి విద్యార్థికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేసిన నాయకులపై పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, తోటి ఉపాధ్యాయులు వీర నారాయణ, ప్రభాకర్, విద్యార్థిపై దాడి చేసిన ఉపాధ్యాయుడు నారాయణ స్వామి లు పోలీసు కేసు పెట్టడం సిగ్గు చేటు అన్నారు. సభ్యసమాజం తల దించుకొనేలా ప్రవర్తించి విద్యార్థిపై దాడి చేసిన ఉపాధ్యాయుడిని అందుకు సహకరించిన తోటి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకొని వారిని వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

## ఎస్టి హాస్టల్‌లో ఆరోగ్య విద్యపై మార్గదర్శక సూచనలు



**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్:** జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారుల ఆదేశాల మేరకు, బుధవారం పోరుమామిళ్లలోని ఎస్టి హాస్టల్‌లో విద్యార్థులకు అన్ని రకాల వ్యాధుల స్క్రీనింగ్ మరియు చికిత్స కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కడప జిల్లా ఆర్ బి ఎస్ కెఎన్‌సిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ సందర్శించి, విద్యార్థులకు ఆరోగ్య విద్యపై మార్గదర్శక సూచనలు అందించారు. ఈకార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ నవీన్ కుమార్, డాక్టర్ వాసంతి, అలాగే డిఈఐసి బృందంలోని డెంటల్ వైద్యులు, కంటి వైద్యుడు, సైకియాట్రిక్ నిపుణులు, చర్మ వ్యాధి నిపుణులు పాల్గొని విద్యార్థులను పరిశీలించారు. అనంతరం కేజీబివి పాఠశాల లో కూడా ఆర్ బిఎస్‌కె స్పెషల్ డ్రైవ్ నిర్వహించబడగా, విద్యార్థులకు స్క్రీనింగ్ మరియు ఆరోగ్య విద్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్టి హాస్టల్ ప్రిన్సిపాల్ శామ్యూల్, డిప్యూటీ హెల్త్ ఆఫీసర్ సాదు వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిర్మలమ్మ, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ రఘురామ్, కేజిబివి ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరి, ఏఎన్‌ఎంఎస్‌లు ఏఎన్‌ఎంలు మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**కడప టౌన్, మేజర్‌న్యూస్ :** వైఎస్సార్ కడప జిల్లాకు సంబందించి ఏపిఎస్ఆర్టీసి వారు అప్రెంటిస్ శిక్షణకై ధరఖాస్తులు కోరుతున్నారు. అభ్యర్థులు తమ ధరఖాస్తులు ఆన్లైన్ ద్వారా www.apprenticeshipindia.gov.in నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, డ్రాఫ్ట్ మెన్ సివిల్, మెషినిష్ట్ ట్రేడులకు ఎంపికలు జరుగును. కావున పైన తెలిపిన ట్రేడులలో ఉత్తీర్ణత అయిన ఆసక్తి అర్హత ఉన్న అభ్యర్థులు 25-10- 2025 నుండి 08-11-2025 తేదీలోగా ధరఖాస్తులు నమోదు చేసుకోవాలి. నిర్ణీత గడువు తర్వాత రిజిస్టర్ చేసిన ధరఖాస్తులు అధికారులు ఎట్టి పరిస్థితిలోనూ అనుమతించరు. అభ్యర్థులు తమ 10వ తరగతి మార్కుల జాబితా ప్రకారం, పేరు, తండ్రి పేరు, తల్లి పేరు, పుట్టిన తేదీ, తమ ఆధార్ కార్డులో వుండేలా చూసుకొని అప్డేట్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ కొరకు, ఐ.టి.ఐ మార్కుల జాబితా, ఎన్.ఐ.టి.సి సర్టిఫికెట్, పొటోలు, పాన్ కార్డు, బ్యాంకు పాస్ బుక్ , కుల ధృవీకరణ పత్రం తీసుకొని వెబ్సైట్ నందు రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత అదే వెబ్సైట్ నందు అప్రెంటిస్ ఆపర్చ్యునిటీస్‌లో ఎస్టాబ్లిష్మెంట్ డీటైల్స్ దగ్గర ఏపిఎస్ఆర్టీసి కడప టైప్ చేసి అప్లై పై క్లిక్ చేసి పోర్టల్ ద్వారానే అప్లై చేయవలెను. మరిన్ని వివరములకు మీకు దగ్గరలోని ప్రభుత్వ ఐ.టి.ఐ లోని ట్రైనింగ్ ఆఫీసరును, లేదా ప్రభుత్వ డి.ఎల్.టి.సి/ ఐ.టి.ఐ., కడప నందలి అప్రెంటిస్ విభాగమును సంప్రదించి అవకాశమును సద్వినియోగ పరచుకోవాలని జిల్లా కన్వీనర్ యం. జ్ఞానకుమార్ తెలిపారు.

# అకడమిక్ పరిశోధనల పరంగా అభివృద్ధి దిశగా ముందుకు వెళదాం

### వైవియు ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్

పెండ్లిమర్రి, వై.వి,యు, మేజర్‌న్యూస్ : అకడమిక్ గా పరిశోధనల పరంగా అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో అన్ని శాఖల విభాగాధిపతులు,సహచర అధ్యాపకులు క్రియాశీలకంగా వ్యవహరించాలని వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ఉద్ఘాటించారు. రాబోయే రోజుల్లో నిర్వహించనున్న కాన్వకేషన్లో నిష్ణాతులైన వారికి గౌరవ డాక్టరేట్ లను ఇవ్వాల్సి ఉంటుందని ఆ జాబితాను మనం సంసిద్ధం చేయాల్సి ఉందన్నారు. అలానే బంగారు పతక దాతలను గుర్తించి వారిద్వారా విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా పథకాలను చూడాలన్నారు. ప్రతి డిపార్ట్మెంట్లో స్కాలర్ల హాజరు తప్పనిసరి అన్నారు. నాణ్యమైన రీసెర్చ్ పేపర్లను ప్రఖ్యాత జర్నల్స్ లో ప్రచురితమయ్యేలా వారిని సమాయత్తం చేయాలన్నారు. రీసెర్చ్ మెథడాలజీ, పరిశోధన పద్దతులు ప్రతిస్కాలర్ తెలుసుకోవాల్సిందేనని చెప్పారు. స్వయం కోర్సులలో వారు ప్రవేశాలు పొందేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పిజి అడ్మిషన్లు కోసం కార్యచరణ ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. అడ్మిషన్ల కోసం ప్రచారాలను నిర్వహించాలని సూచించారు. తక్షణ స్పాట్ అడ్మిషన్లలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా



చూడాలన్నారు. అనంతరం జరిగిన ప్రధానమంత్రి ఉచ్ఛరత శిక్షా అభియాన్(పీఎం ఉష ) సమావేశంలో పలు సూచనలిస్తూ ఇందులో ఉన్న సభ్యులందరూ మార్చి 31 వ, తేదీ లోపు వర్క్ షాపులు, సెమినార్లు, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్ , అన్ని శాఖల అధిపతులు, సమన్వయకర్తలు, పి.ఎం.ఉషా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతులు పంట నష్టం జరగకుండా చూసుకోవాలి

**కడప టౌన్, మేజర్‌న్యూస్:** వై.ఎస్.ఆర్ కడప జిల్లా నందు గత కొన్ని రోజుల నుంచి జిల్లా అంతా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు లోతట్టు ప్రాంతాలల్లో ఉన్న పంటలు మునకకు గురయ్యే అవకాశం ఉన్నది. కోత దశలో ఉన్నటువంటి వరి, మినుము పంటలకు గింజలు మొలకలు వచ్చి పంట నష్టం జరిగే అవకాశం ఉన్నది.కావున జిల్లా వ్యవసాయ అధికారి బి. చంద్ర నాయక్ తెలియపరచిన సూచనలు పాటించి పంట నష్ట నివారణ చేసుకోవలసినదిగా రైతులను కోరడమైనది.మునకకు గురైన ప్రాంతాలల్లో పంటల నుండి జోము కాలువలు ఏర్పాటు చేసి పొలాల్లో ఉన్న అధిక నీటిని బైటికి పంపాలని తేలపటమైనది. కోత దశలో ఉన్నటువంటి వరి పంట, క్రింది పడిపోయినట్లయితే వాటిని లేపి జడ కట్టలు కట్టి నీటిలో మునగకుండా నివారించుకోవలెను. కోత దశలో ఉన్న వరి, మినుము మరియు ఇతర గింజ పంటలకి ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసి మొలకలు రాకుండా నివారించుకోవలెను. తదుపరి నత్రజని, భాస్వరం ఎరువులను చల్లు కోవలసినదిగా కోరడమైనది